FI FLASH INDIA NEWS

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

TELANGANA RISING 2047

సంపుటి : 16 | సంచిక :174 | శుక్రవారం 15.08.2025 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-



# రాహుల్ జీ ఇదేం పని..

## ప్రాణహాని అప్లికేషన్ పై యూ టర్న్

**ఢిల్లీ :** గాడ్సే వారసులతో తనకు ప్రాణహాని ఉందని నాకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనంటూ పుణె కోర్టులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన అప్లికేషన్ విషయంలో ఏ/v అడ్వకేట్ యూ టర్న్ తీసుకోవడం రాజకీయం దుమారం రేపుతోంది. సావర్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తనపై ఫిర్యాదు చేసిన వ్యక్తి నాథూరాం గాడ్సే వారసుడని వారి వంశంలోనే హింస, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనలు ఉన్నాయని వారితో నా ప్రాణాలకు హాని ఉందని రాహుల్ గాంధీ తరపున అడ్వకేట్ ఆరోపించారు. రాహుల్ గాంధీకి ప్రభుత్వమే రక్షణ కల్పించాలని కోరారు. అయితే కోర్టులో ఈ అప్లికేషన్ సమర్పించిన గంటల వ్యవధిలోనే ఈ అప్లికేషన్ ను వెనక్కి తీసుకోబోతున్నామని రాహుల్ గాంధీ తరపున అడ్వకేట్ డ్వకేట్ మిలింద్ దత్తాత్రేయ పవార్ ప్రకటించడం రాహుల్ గాంధీని ఇరుకున పెట్టినట్లైంది. ఇంతకీ ఏం జరిగిందంటేప్రాణహాని ఉందని కోర్టులో రాహుల్ గాంధీ తరపున అడ్వకేట్ మిలింద్ దత్తాత్రేయ పవార్ దరఖాస్తు చేశారు. అయితే ఈ అప్లికేషన్ పై రాహుల్ గాంధీ అనుమతి లేకుండా అడ్వకేట్ కోర్టులో సమర్పించారని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. అడ్వకేట్ మిలింద్ దత్తాత్రేయ పవార్ సైతం ఓ ప్రకటన విడుదల చేశారు. నాకు అనిపించింది, తగినది అని భావించి ఈ అప్లికేషన్ దాఖలు చేశానని రాహుల్ గాంధీతో నేను ఎప్పుడు నేరుగా మాట్లాడలేదని తాను ఇచ్చిన అప్లికేషన్ ను వెనక్కి తీసుకుంటానని నిన్నే ఓ ప్రకటన విడుదల చేశారు.దీంతో రాహుల్ గాంధీ ప్రమేయం లేకుండానే అడ్వకేట్ ఈ అప్లికేషన్ నమోదు చేయడం ఇప్పుడు రాజకీయంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వ్యవహారంపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. తన న్యాయవాది కూడా సీరియస్ గా తీసుకోని వ్యక్తిని ఈ దేశం ఎలా పట్టించుకుంటుందని సెటైర్లు వేస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు. ఓట్ల చోరీ అంశంపై ఉద్యమాన్ని ఉధృతం చేసే ప్లాన్ తో ఉన్నారు. వచ్చే సారి తప్పకుండా బీజేపీని గద్దె దించుతామని ప్రతిన చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఇలాంటి నవ్వులాట పనులు చేయడం ఏంటని ఇకనైనా రాహుల్ గాంధీ ఇలాంటి విషయాల్లో సీరియస్ గా వ్యవహరించాలని కాంగ్రెస్ అభిమానులు సైతం పెదవి విరుస్తున్నారు.

## ముమ్మాటికీ రేవంత్ ప్రభుత్వ వైఫల్యమే



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వానాకాలం పంట సాగు పనులు ప్రారంభమయ్యాయి. అయితే, పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాల్సిన అన్నదాతలు యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వద్ద క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారు. తమ వంతు వచ్చేదెన్నడో.. యూరియా చేతికొచ్చేది ఎన్నడోనని చింత చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల పడిగాపులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'X' (ట్విట్టర్) వేదికగా ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. విత్తనాలు వేసిన రైతులు ఎరువుల కోసం షాపుల ఎదుట నిరీక్షిస్తున్నారని ఆరోపించారు. సాగు పనులు వదిలి సొసైటీల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని మండిపడ్డారు. ఒక్క బస్తా కోసం ఉదయం నుంచి రాత్రి వరకూ నిద్రాహారాలు మాని నిరీక్షిస్తున్నారని ధ్వజమెత్తారు. క్యూలో ఉన్నోళ్లకు సైతం ఎరువుల బస్తాలు దొరక్కపోవడంతో చివరికి నిరాశతో వెనుదిరిగిపోతున్నారని తెలిపారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో విరివిగా దొరికిన ఎరువులు.. కాంగ్రెస్ హయాంలో కనీసం ఒక్క బస్తా కూడా దొరక్కపోవడం ముమ్మాటికీ రేవంత్ సర్కార్ వైఫల్యమేనని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## దిండా పోడు రైతుల అరెస్ట్ పిరికిపంద చర్య



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పోడు భూములకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడానికి దిండా గ్రామం నుంచి హైదరాబాద్ కు 400 కిలోమీటర్ల పాదయాత్రగా వెళ్తున్న పోడు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఖండించారు. రైతులను అక్రమంగా అరెస్ట్ చేసి మూడు బస్సుల్లో రైతులను తిరిగి ఆసిఫాబాద్ కు తరలించడం దారుణమైన చర్యగా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం కాగజ్ నగర్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు తమ బాధలు చెప్పుకోవడానికి వస్తే అరెస్ట్ చేయడమేంటని ప్రశ్నించారు. రైతు డిక్లరేషన్ పేరు చెప్పి రైతులకు బేడీలు వేసి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. లగచర్లలో, గద్వాలలో రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం నేడు దిండా రైతులను అరెస్టు చేసిందని మండిపడ్డారు.గతంలో కేసీఆర్ పాలనలో రైతులు స్వర్ణయుగం చూసారని, రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో 550 మంది రైతులు మరణించారని గుర్తు చేశారు. వరంగల్ డిక్లరేషన్ లో రైతుల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ, రాజ్యాంగం పట్టుకొని జీవించే హక్కు ఆర్టికల్ 21 గురించి మాట్లాడుతున్నారని, కానీ తెలంగాణలో రైతులు తమ బాధలు చెప్పుకుందామంటే అరెస్ట్ చేస్తున్నారని వాపోయారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, దిండా గ్రామ బీసీలు భూముల గురించి అడిగితే మాత్రం అరెస్ట్ చేయడం, బీసీలకు మోసం చేయడం కాదా? అని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యే వారి ఓట్లతో గెలిచి, ఈ రోజు వారి గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి, కేంద్ర అటవీ శాఖ మంత్రికి ఈ విషయాన్ని ఎందుకు చేరవేయడం లేదని నిలదీశారు. వెంటనే ప్రభుత్వం రైతులను విడుదల చేయాలని, వారికి పోడు భూములపై హక్కులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బంది పెడుతున్న అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రతి జిల్లాకు కోటి రూపాయలు రిలీజ్

- సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ. కోటి విడుదల: మంత్రి పొంగులేటి
- భారీ వర్షాలు, సహాయక చర్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష
- కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై ఇవాళ సెక్రటేరియట్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సీఎస్ కె.రామకృష్ణరావుతో పాటు జిల్లా కలెక్టర్లు ఈ సమీక్షకు హాజరయ్యారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి ఆయా జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్న మంత్రి.. లోతట్టు, ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశించారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేసినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాల సమన్వయంతో పని చేయాలని, జీహెచ్ఎంసీలో మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అధికారుల సెలవులు రద్దు చేసి అందరూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

## కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయండి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మన ఊరు - మన బడి కార్యక్రమంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేయాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్యంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన తాజాగా సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తనని కలిసి వారి పరిస్థితిని వివరించుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద సివిల్ పనులు పూర్తయ్యాయని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు దీనిని ధృవీకరించారని పేర్కొన్నారు. రాష్ట్రం అంతటా మన ఊరు- మన బడి కార్యక్రమం కింద పూర్తయిన సివిల్ పనులకు పెండింగ్ బిల్లులు రూ.361.350 కోట్లు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.రాష్ట్రంలోని చిన్న కాంట్రాక్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల (స్కూల్ పేరెంట్స్ కమిటీ) అవసరాలను తీర్చడం చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్య కాబట్టి, పెండింగ్ లో ఉన్న రూ.361.350 కోట్ల బిల్లులను విడుదల చేయాలని కోరారు. చిన్న, పేద కాంట్రాక్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు చేతి రుణాలు తీసుకుని ఈ పనులను పూర్తి చేశారని, బిల్లులు రాకపోవడంతో నేడు వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన లేఖలో వెల్లడించారు. మన ఊరు- మన బడి పథకం కింద రాష్ట్రం అంతటా పూర్తయిన సివిల్ పనులకు సంబంధించిన రూ.361.350 కోట్ల పెండింగ్ బిల్లులను అత్యంత ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

## 400 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో నిర్వహించిన తిరంగా ర్యాలీ దేశభక్తి జాతీయ సమైక్యతను ప్రదర్శించే ఒక గొప్ప కార్యక్రమంగా నిలిచింది. ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా 400 అడుగుల పొడవైన భారీ జాతీయ జెండా నిలిచింది. ఇది ర్యాలీలో పాల్గొన్న వారిలో ఉత్సాహాన్ని నింపింది. సుమారు 1500 మంది భారతీయ జనతా పార్టీ (భాజపా) కార్యకర్తలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు, దేశభక్తి నినాదాలతో వీధులను మార్మోగించారు.ఈ ర్యాలీ కూకట్ పల్లి నియోజకవర్గంలోని బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో జరిగినట్లు తెలుస్తోంది. ఇందులో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం లేదా "హర్ ఘర్ తిరంగా" వంటి జాతీయ కార్యక్రమాల స్ఫూర్తితో నిర్వహించబడినట్లు తెలిపారు. ఇది భారత సైన్యానికి మద్దతుగా, దేశ సమైక్యతను చాటడానికి వర్తిస్తుంది.ర్యాలీలో భాజపా కార్యకర్తలతో పాటు విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.. ఇది యువతలో దేశభక్తిని పెంపొందించే లక్ష్యాన్ని సూచిస్తుంది. ఈ ర్యాలీ ద్వారా, భారత సైనికులకు సంఘీభావం తెలియజేయడంతో పాటు, జాతీయ జెండా గౌరవాన్ని ప్రజల్లో మరింతగా చాటుతుంది.ఈ కార్యక్రమం హైదరాబాద్ లో జాతీయ జెండా పట్ల గౌరవాన్ని, దేశభక్తిని ప్రోత్సహించేందుకు ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. ఇటువంటి ర్యాలీలు యువతను దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొనేలా ప్రేరేపిస్తాయి, జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తాయిని చెబుతున్నారు.

## ఉప్పొంగిన లక్ష్మాపూర్ ప్రాజెక్ట్



**పరిగి ,ఫ్లాష్ ఇండియా :** పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగు వంకలు అన్ని పొంగిపొర్లాయి. మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్ట్ పొంగి ఉద్ధృతంగా ఉరకలేస్తుంది. బీసీ కాలనీ సాయిరాం కాలనీలో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. హైవే రోడ్డు పై ముత్తూట్ ఫైనాన్స్ వద్ద, వివేకానంద విగ్రహం వద్ద వరద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిగి నుంచి నస్కల్ మీదుగా వికారాబాద్ వెళ్లే రూట్లో పరిగి పెద్దవాళ్లు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. వాగు ఉధృతి తగ్గే వరకు వాహనదారులు రోడ్డుపైనే బస్సులోని వారు బస్సులో, కారులోని వారు కారులోనే తమ వాహనాల్లో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. పంట పొలాల్లో వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరింది.

**అమ్మో భూకంపం..!**

వికారాబాద్ జిల్లా పరిగి మండలం బసిరెడ్డి పల్లిలో గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించిందని స్థానికులు తెలిపారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెద్దశబ్దంతో సుమారు మూడు నుంచి నాలుగు సెకండ్లు భూమి కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఉన్న కాళీ వంట పాత్రలు కింద పడటంతో గ్రామస్తులు భయంతో బయటికి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న పరిగి సీఐ సామల శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ మోహన్ కృష్ణ తన సిబ్బందితో కలిసి బసిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నారు. బసిరెడ్డిపల్లితో పాటు రంగాపూర్ న్యామత్ నగర్, హనుమాన్ గండి, దేవనోని గూడ ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాలు నిర్వీర్యం



**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** ప్రజాపాలన పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. గురువారం స్థానిక రెడ్ల సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులు చదువుకుంటే తమను ప్రశ్నిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను గాలికి వదిలేసిందని, అందుకే గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఎక్కువగా జరుగుతుందని అన్నారు.భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ప్రయాణించే పరిస్థితి లేదని, రోడ్డు పాడై చాలా రోజులు అవుతున్నా... మంత్రులు, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులో పూడిక తీసే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి, అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారని, వెంకట్రావు భద్రాచలం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సమయంలో జరిగిన అభివృద్ధి తప్ప, కాంగ్రెస్ అభివృద్ధి చేసింది ఏమి లేదని పేర్కొన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ కే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రామ్ ప్రసాద్, ఆకోజు సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాంసాహారులు కూడా జంతుప్రేమికుల

**ఢిల్లీ :** వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులు జంతు సంతతి నియంత్రణ చర్యలు అమలు చేయకపోవడం వల్లే తీరు వల్లే ఈ సమస్య ఉత్పన్నం అవుతున్నదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఢిల్లీలో విధి కుక్కల న్నింటినీ తరలించాలని ఈ నెల 11న జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్.ఆర్ మహదేవన్ ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలపై తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ వివాదాన్ని సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్ .వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇవాళ విచారణ జరిపింది. వాదనలు విన్న ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. ఆగస్టు 11న ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.అంతకు ముందు ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ జంతువులను ఎవరూ ద్వేషించరు. కానీ వీటి దాడుల్లో ఎంతో మంది చిన్నారుల ప్రాణాలు కోల్పోతున్నారని కోర్టుకు వివరించారు. ఢిల్లీ వీధుల్లోని కుక్కలను తరలించాలన్న సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సమర్థించారు. కుక్కల తరలింపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య కంటే బాధితుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. మాంసాహారం తినేవారు కూడా జంతుప్రేమికులమని ప్రకటించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా 37 లక్షల కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నట్లులు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయని రోజుకు దాదాపు 10 వేల కేసులు వందల సంఖ్యలో రేబిస్ మరణాలు చోటు నమోదు అవుతున్నాయని తెలిపారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిల్ వాదనలు వినిపిస్తూ వీధి కుక్కలను కనిపించకుండా వాటిని షెల్టర్లకు తరలించాలని ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరారు. కుక్కలకు షెల్టర్లు లేవని వాటిని ఎక్కడికి తరలిస్తారు? షెల్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిర్మిస్తుందా అనే ప్రశ్నలను లేవనెత్తారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

## ప్రపంచంతో పోటీపడాలి..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నంలోని సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్ఎంఈఎల్ ను సింగరేణి సీఎండీ బలరామ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాలు తయారీ, పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ సంస్థలకు ఏపీహెచ్ఎంఈఎల్ కన్నా మించి మిషనరీ, మానవ వనరులు లేవని భట్టి విక్రమార్క అన్నారు. సంస్థలో పనిచేసే అధికారులు, కార్మికులకు నిబద్ధత, ప్రపంచంతో పోటీ పడగలం అన్న ఆలోచన ఉంటే.. మనం కూడా ప్రపంచంతో పోటీ పడగలమని డిప్యూటీ సీఎం భరోసా కల్పించారు.ఈ సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీ ని నియమిస్తామని తెలిపారు. వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా ఏ తరహాలో ముందుకు పోవాలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు, సిబ్బంది ఎంత బాగా పని చేస్తే అంత బాగా లాభాలు సాధిస్తామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, రాష్ట్రాల ప్రగతికి దోహదపడవచ్చు అని పేర్కొన్నారు. సంస్థను, ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలని, యంత్రాలకు ఓవరాలింగ్ చేయాలని, రంగులు వేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనిచేసే సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలని ఆదేశించారు.కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతోనే ఈ పరిశ్రమ ముందుకు పోతుందన్నారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్ కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మత్తు వరకే పరిమితం కాకుండా రాష్ట్రంలోనే కాదు, దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకొని బీహెచ్ఈఎల్ మాదిరిగా ఏపీహెచ్ఎంఈఎల్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సంస్థను భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

## మెట్రో రైలు ఎక్కిన బండి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు న్యూఢిల్లీలో మెట్రో రైల్ లో ప్రయాణించారు. వాస్తవానికి గురువారం సాయంత్రం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ లోని తన నివాసం నుండి అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరాల్సి ఉంది. అయితే భారీ వర్షాలు, ట్రాఫిక్ రద్దీవల్ల ఢిల్లీలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తన ప్రోటోకాల్ కాన్వాయ్ ను పక్కనపెట్టి సతీమణి బండి అపర్ణతో కలిసి సమీపంలోని శివాజీ స్టేడియం వద్దనున్న మెట్రో స్టేషన్ కు వెళ్లారు. అక్కడ టికెట్ తీసుకుని మెట్రో రైల్ ఎక్కి ఢిల్లీలోని ఏరో మెట్రో స్టేషన్ కు చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా ఎయిర్ పోర్టులోకి వెళ్లి ఫ్లైట్ ఎక్కి హైదరాబాద్ కు పయనమయ్యారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

## స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతకాలు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఉత్తమ సేవలు అందించిన అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పతాకలను ప్రకటించింది. ఇందులో తెలంగాణకు ఒక గ్యాలంటరీ మెడల్, 2 ప్రెసిడెంట్ మెడల్స్, 11 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. ఏఎస్ఐ సిద్ధయ్య, నిడమానూరి హుస్సేన్ ప్రెసిడెంట్ మెడల్స్ కు ఎంపిక అయ్యారు. ఆంధ్రప్రదేశ్ కు 2 ప్రెసిడెంట్ మెడల్స్, 20 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ దక్కాయి. దేశవ్యాప్తంగా మొత్తం 233 మందికి పోలీసు గ్యాలంటరీ పతకాలు, 99 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 758 మందికి పోలీసు సేవా పతకాలు ప్రకటించారు. ఏటా స్వాతంత్ర్యం దినోత్సవం నాడు ఉత్తమంగా పనిచేసే అధికారులకు కేంద్రం అవార్డులు అందించడం ఆనవాయితీ.

# లెక్క తేల్చాసిందే

- **బిహార్ ఓటర్ జాబితా నుంచి ఏకంగా 65 లక్షల మందిని తొలగించినట్టు బయటకు రావడం సంచలనాలకు కారణమవుతోంది.**
- **ఈ అంశంపై పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.**
- **ఈ పిటిషన్‌లను విచారించిన సుప్రీం కోర్టు ఎన్నికల సంఘానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.**



**ఢిల్లీ:** బిహార్ ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఎలక్షన్ కమిషన్ చేస్తున్న హడావిడి తీవ్ర వివాదానికి కారణమవుతోంది. ఎన్నికలు మరో రెండు నెలల్లో ఉన్న తరుణంలో ఈసీ ఇలా ఓటర్ జాబితాను సవరించడం పట్ల తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఓటర్ జాబితా నుంచి ఏకంగా 65 లక్షల మందిని తొలగించినట్టు బయటకు రావడం సంచలనాలకు కారణమవుతోంది. ఈ అంశంపై పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ లను విచారించిన సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.బిహార్ ఓటర్ జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ లో పొందుపరచాలని, వారి పేర్లను తొలగించడానికి గల కారణాలను కూడా అ ప్ లోడ్ చేయాలని సూచించింది. ప్రతి ఓటరు దానిని యాక్సెస్ చేయగలిగేలా ఈ జాబితాను ప్రచారం చేయాలని సూచించింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బిహార్ లో ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ విచారించారు. జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మందిలో 22 లక్షల మంది మరణించారని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది.22 లక్షల మంది మరణించినట్లయితే, దానిని బూత్ స్థాయిలో ఎందుకు వెల్లడించలేదని, పౌరుల హక్కులు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉండాలని తాము కోరుకోవడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 65 లక్షల మంది పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాన్ని ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ లో పొందుపరచాలని సూచించారు. ఆ విషయాన్ని గరిష్ఠ సర్క్యులేషన్ ఉన్న స్థానిక భాషా వార్తాపత్రికలు, దూరదర్శన్, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం కల్పించాలని సూచించింది.జిల్లా ఎన్నికల అధికారికి సోషల్ మీడియా హ్యాండిల్ ఉంటే, అక్కడ కూడా నోటీసును ప్రదర్శించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ జాబితాలో పేరు ఉన్న వ్యక్తులు తమ పేరును ఎందుకు తొలగించకూడదో పేర్కొంటూ తమ ఆధారాలను జిరాక్స్ కాపీలతో సహా సమర్పించుకోవడానికి అవకాశాలు కల్పించాలని పేర్కొంది. ఓటర్ జాబితా నుంచి తొలగించిన పేర్లను అన్ని పంచాయతీ భవనాలు, బ్లాక్ డెవలప్ మెంట్, పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుపైనా ప్రదర్శించాలని, తద్వారా ప్రజలు జాబితాను మాన్యువల్ గా యాక్సెస్ చేసుకునే వీలుంటుందని తెలిపింది.

# డిబేట్‌కు నేను సిద్ధం..
## దమ్ముంటే మీరు రండి!

- **తెలంగాణలోనే యూరియా కొరత ఎందుకు**
- **యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు**
- **కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత**



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. గతం కన్నా ఎక్కువ తెలంగాణకు కేంద్రం ఇచ్చిందని, ఇంకా కొంత మొత్తమే ఇవ్వాల్సి ఉందన్నారు. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుందని ఎద్దేవా చేశారు. యూరియా కొరతపై తాను డిబేట్ కు సిద్ధం అని, దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రండని రాంచందర్ రావు సవాల్ విసిరారు.'ఏ రాష్ట్రంలో రాని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వస్తుంది. యూరియాను గతం కన్నా ఎక్కువగా తెలంగాణకు కేంద్రం ఇచ్చింది. ఇంకా కొంత మాత్రమే ఇవ్వాల్సి ఉంది. యూరియా ఏమవుతుంది, ఎవరు తింటున్నారు. కాంగ్రెస్ నాయకులే ఫెర్టిలైజర్ షాపులకు వెళ్లకుండా డైవర్ట్ చేస్తున్నారు. కేంద్రం రైతులకి మేలు చేస్తుంది. కాంగ్రెస్ మాత్రం రైతులకు ద్రోహం చేస్తుంది. ఎరువులు ఎటు వెళ్తున్నాయో దమ్ముంటే దర్యాప్తు చేయండి, లేదంటే సీబీఐకి అనుమతి ఇవ్వండి. దర్యాప్తుకు ఇవ్వడానికి ఈ ప్రభుత్వంకు దమ్ము లేదు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలోకి వస్తే అక్కడ ఆ పార్టీ నాయకులే దళారులు. నాయకులే బ్లాక్ మార్కెట్ చేస్తారు. ఏ రాష్ట్రానికి ఎంత కోటా అనేది ముందే ఫిక్స్ అయి ఉంటుంది. బీఆర్ఎస్ ఆరోపణలు కరెక్ట్ కాదు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ కృత్రిమ కొరత సృష్టిస్తుంది. నేను డిబేట్ కు సిద్ధంగా ఉన్నా, దమ్ముంటే రండి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు.

# ఆగస్టు 22 లోపు ఇందిరమ్మ ఇండ్లు

- **22 తర్వాత శుభదినాలు కావు.. మిస్సయితే దసరా వరకు ఆగాల్సిందే!**
- **ఖమ్మం జిల్లా అశ్వారావుపేట సెగ్మెంట్ లో ప్రారంభించనున్న సీఎం?**
- **పలుచోట్ల చురుకుగా కొనసాగుతున్న నిర్మాణం**



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పనుంది. ఈ నెలాఖరు నాటికి ఇండ్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 22తో శ్రావణ మాసం పూర్తవుతుంది. 23 వ తేదీ నుంచి భాద్రపద మాసం స్టార్ట్ అవుతుంది. సహజంగా భాద్రపద మాసాన్ని శూన్యమాసంగా పరిగణిస్తారు. ఈ నెలలో శుభకార్యాలు చేయరు. దీంతో శ్రావణమాసంలోనే పూర్తి చేయాలని సీఎం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లా అశ్వారావు పేట సెగ్మంట్ పరిధిలోని చంద్రుగొండ మండలంలో సుమారు యాభై గృహాల నిర్మాణం పూర్తయిందని, వాటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించింది. ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలను నిర్మించాలని సంకల్పంగా పెట్టుకొని ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేక యాప్ ను రూపొందించింది. ఎలాంటి అక్రమాలు జరగకుండా కమిటీలు వేసింది. నిర్మాణం ప్రారంభించిన ప్రదేశం వివరాలను యాప్ లో పొందు పర్చింది. వాటికి జియో ట్యాగింగ్ కూడా చేసింది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే అందేలా అనేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం అవసరమైన ఇసుకను కూడా ప్రభుత్వం ఉచితంగా అందించింది. దీంతో నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల చివరదశకు చేరుకోగా మరికొన్ని చోట్ల పూర్తయ్యాయి. వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సమాచారం.

# కేసీఆర్ కంటే కోదండరాం ఎక్కువ ఉద్యమం చేశారు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రొఫెసర్ కోదండరాం , అమెర్ అలీఖాన్ లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ తెలంగాణ గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. గవర్నర్ నియామకాల్లో ఇది వరకు జరిగిన తీరులోనే జరిగాయని తెలిపారు. దాంట్లో లొసుగులు ఉన్నాయని సుప్రీంకోర్టు భావించిన తర్వాత.. సుప్రీంకోర్టు తుది తీర్పు తర్వాత ఏం నిర్ణయం తీసుకోవాలో ఆలోచిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని, పొత్తులో భాగంగా కోదండరాంకు ఎమ్మెల్సీ ఇచ్చామన్నారు. ఆయన శాసనమండలిలో ఉండటం అవసరమని చెప్పారు.కేసీఆర్ కంటే ప్రొఫెసర్ కోదండరాం ఎక్కువ ఉద్యమం చేశారని హాట్ కామెంట్స్ చేశారు.అదృష్టం ఉండి కేసీఆర్



సీఎం అయ్యారని, కోదండరాం వెనుక పడ్డారని అన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కోదండరాం చట్టసభల్లో ఉండాలనే ఎమ్మెల్సీ ఇచ్చామని వివరించారు. అలాగే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తది అంటే చిన్న పిల్లోడు కూడా నవ్వుతాడని విమర్శలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని కూడా అయిపోయిందని అన్నారు. మరో 20 ఏళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

# ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అరెస్ట్..
## మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా ఇతర నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచినందుకు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి, వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్బంధించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమని తెలిపారు. పోడు రైతులను వేధించడం ఆపి, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని.. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తో సహా బీఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందని ఫైర్ అయ్యారు.దిందా పోడు రైతులను అరెస్ట్ చేసి తరలిస్తుండగా బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, నాయ కులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను పోలీసులు అరెస్టు చేశారు. అనంత రం కాగజ్ న గర్ నుంచి సిర్పూర్ టీకి త ర లించారు. అక్కడి నుంచి కౌటాలకు తరలిస్తుండగా పోలీసుల వాహనాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను కౌట ల వైపు తీసుకెళ్లిన ట్లు సమాచారం.

# ప్రశాంతమైన నగరంగా ఖమ్మం



**ఖమ్మం ,ఫ్లాష్ ఇండియా :** ప్రశాంతమైన నగరంగా ఖమ్మంను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఖమ్మం 36వ డివిజన్ గాంధీ చౌక్ లో గురువారం 2 కోట్ల 25 లక్షలతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రైన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... నగరంలో ప్రజలందరూ కలిసికట్టుగా ప్రశాంతంగా బ్రతకాలని గాంధీ చౌక్ వ్యాపారస్తులు ఎన్నికల సమయంలో కోరుకున్నారని, ప్రస్తుతం ప్రశాంతమైన ఖమ్మం నగరం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన తల్లి సోనియాగాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని రైతుల శ్రేయస్సుకు, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. రోడ్డు వెడల్పు చేసుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందని, మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలను పెంచి గ్రీనరీ పెంపుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. అనంతరం ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఖమ్మం నగరంలో అవసరమైన రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. మంత్రి ప్రత్యేక చొరవ వల్ల ఖమ్మం ఖిల్లాకు రోప్ వే మంజూరు అయ్యిందని, ఖానాపురం ఊర చెరువు నుంచి అల్లిపురం వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని అన్నారు.ఖమ్మం నగర ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు వీలుగా వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 155 కోట్లతో మోడల్ మార్కెట్ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రజల అంగీకారంతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టామని అన్నారు. రైతాంగం బాగుంటే వ్యాపారాలు బాగా జరుగుతాయని అన్నారు. నగర అభివృద్ధి ఆకాంక్షించే మంత్రి తుమ్మలకు ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని మేయర్ తెలిపారు. అనంతరం మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు కీలక ఆదేశాలు..




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రోడ్ నెం. 12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని అధికారులకు హైకోర్టు ఆదేశించింది. పెద్దమ్మ తల్లి విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈరోజు నెల 18కు వాయిదా వేసింది.కొన్ని రోజుల క్రితం అధికారులు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఇక్కడి స్థానికులు, హిందూ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశాయి. దీనిలో భాగంగానే ఇటీవల కుంకుమార్చాన పూజకు పిలుపునివ్వడంతో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ముందే అప్రమత్తమైన పోలీసులు.. ముందు జాగ్రత్తగా పెద్దమ్మ తల్లి ఆలయం దగ్గరగా భారీ ఎత్తున పోలీసులను మోహరించారు. గతంలో ఈ అంశంపై బండి సంజయ్ సైతం స్పందించారు. తెలంగాణలో బోనాల పండుగ సందర్భంగా బంజారాహిల్స్ లోని పెద్దమ్మ గుడిని కూల్చడం పట్ల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను దారుణమైన చర్యగా అభివర్ణిస్తూ, దీని వెనుక రాజకీయ కుట్ర ఉందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఒక వర్గం ఓట్లను సంపాదించేందుకు కాంగ్రెస్ ఈ చర్యకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో తీవ్ర విమర్శలు చేశారు.


# రాహుల్ గాంధీ నియోజకవర్గంలో 71 వేల 977 దొంగ ఓట్లు..!



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్ తో ఎన్నికకు సిద్ధమా? అని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. మొదట్లో బీజేపీ ఈవీఎంలను వ్యతిరేకించింది.. కానీ శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ఈవీఎంలకి మద్దతు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు కరెక్ట్.. ఓడితే రాంగ్ అంటున్నారు.. రాజీవ్ గాంధీ ఆలోచన ప్రోగ్రెస్, రాహుల్ గాంధీ ఆలోచన డిస్ట్రక్టివ్ అని విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని.. బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించి ఓటు తీసేస్తారనే భయ పుట్టుకుందన్నారు.రాహుల్ గాంధీ గెలిచిన రాయబరెలిలో 2 లక్షల ఓట్లపై అనుమానం ఉందని.. 71 వేల 977 ఫేక్ ఓటర్స్ ఉన్నారనన్నారు ఎంపీ రఘునందన్ రావు. 92 వేల 447 మాస్ ఓటర్ నమోదు చేశారని... 54 వేల ఫేక్ బర్త్ డే సర్టిఫికేట్ లు పెట్టారని ఆరోపించారు. వయనాడ్, డైమండ్ హార్బర్ నియోజక వర్గాలపై కూడా అనుమానం ఉందన్నారు. డింపుల్, అఖిలేష్ యాదవ్ నియోజక వర్గాల్లో కూడా దొంగ ఓట్లు ఉన్నాయని చెప్పారు. తన నియోజకవర్గంలో కూడా రోహింగ్యలకి ఓటు ఇచ్చారన్నారు. ఫారిన్ ఆర్గనైజేషన్ లు ఏజెన్సీలు దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయని.. ఫండింగ్ చేస్తున్నాయన్నారు. దొంగ ఓట్లుతో గెలిచారని కోర్టు చెబితే ఇందిరా గాంధీ ముఖం చూపించలేక కొంగు కప్పుకొని పోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ తో నిర్వహించాలని సూచించారు.

# మీ కథను మా రాహుల్‌గాంధీ ముగిస్తాడు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపైన మాట్లాడేంత స్థాయి మెదక్ ఎంపీ రఘునందన్ రావు కి లేదని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక వీడియో విడుదల చేశారు. అడ్డిమారి గుడ్డి సూటితో కన్నులొట్టపోయినట్లు బీఆర్ఎస్ సహకారంతో ఎంపీగా గెలిచావని హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావుతో ఒప్పందం చేసుకుని మెదక్ ఎంపీ అయ్యావని ఆరోపించారు. రాహుల్ గాంధీకి, నీకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పెద్ద వాళ్ల పైన మాట్లాడితే పెద్ద వాడివి అయిపోతానని రఘునందన్ రావు అనుకుంటున్నాడు.. నీకంత సీన్ లేదు.. బీజేపీలోనే నీకు బేస్ లేదు.. అని తీవ్ర విమర్శలు గుప్పించారు.రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము మీకు లేదన్నారు. ఎన్నికల కమిషన్ ను ప్రశ్నిస్తుంటే మీరేందుకు ఉలిక్కి పడుతున్నారు.. అసలు మీ భయం ఏంటి..? మీకెందుకంత వణుకు..? అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా చిత్ర విచిత్రాలను మా రాహుల్ గాంధీ బయటపెడుతున్నారని, చనిపోయిన వాళ్లతో టీ తాగే అద్భుత అవకాశం ఈసీ రాహుల్ గాంధీకి ఇచ్చిందని తెలిపారు. చనిపోయిన వాళ్లు ఏకంగా సుప్రీంకోర్టులో



ప్రత్యక్షమౌతున్నారని, రాహుల్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఈసీ నీళ్లు మింగుతోందని విమర్శించారు. బండారం బయటపడుతుందనే భయంతో బీజేపీ నాయకులున్నారని, మీరెంత మాట్లాడినా ఉపయోగం లేదు.. మీ కథ ను మా రాహుల్ గాంధీ ముగిస్తాడు చూడండి.. అంటూ అద్దంకి దయాకర్ ఫైర్ అయ్యారు.

# సుప్రీంకోర్టు తీర్పుతో 'ఓటు చోరీ' రుజువైంది

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సుప్రీంకోర్టు తీర్పుతో ఓట్ చోరీ అంశం రుజువైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓటు అనే ఆయుధాన్ని అక్రమంగా తొలగించడం, ఓటు వేయకుండా చేయడం, దొంగ ఓట్లతో ఏం జరుగుతుందో దేశ ప్రజలు గమనించాలన్నారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 65 లక్షల తొలగించిన ఓట్లను వెబ్ సైట్ లో పెట్టాలని, వాటిని తొలగించడానికి గల కారణాలను తెలియజేయాలని, నూతన ఓటరు నమోదు చేస్తే ఆధార్ కార్డు తప్పనిసరి చేయాలని, అసలు ఓటరు నమోదు విధానాన్ని ఏ విధంగా చేస్తున్నారో చెప్పాలని నాలుగు ప్రధాన ప్రశ్నలతో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నికల కమిషన్ ను ఆదేశించిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆధార్ కార్డుతో



ఓటు లింక్ చేసి ఒక ఓటు - ఒక మనిషి అనే విధానాన్ని తీసుకురావాలన్న రాహుల్ గాంధీ డిమాండ్ ను ఎన్నికల కమిషన్ స్పందించాలని మంత్రి పొన్నం అన్నారు.

సంపాదకీయం

# మహిళల భద్రత సామాజిక బాధ్యత

రాష్ట్రంలో మహిళల భద్రత, సంక్షేమం- కేవలం ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమం మాత్రమే కాదు యావత్ సమాజం కలిసికట్టుగా ముందుకు నడవాల్సిన అంశం. విద్య, ఉపాధి, భద్రత వంటి రంగాలలో మహిళలు సాధిస్తున్న పురోగతికి తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం స్పష్టమవుతోంది.మహిళల భద్రతపై ఒక వైపు ప్రభుత్వం, మరో వైపు మహిళా కమిషన్, మహిళా సంఘాలు అనేక చర్యలు తీసుకుంటున్నా.. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హింసాత్మక ఘటనలు, లైంగిక దాడులు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. పోలీసు వ్యవస్థను మరింత బాధ్యతతో, మహిళాభిముఖంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. సంస్కృతి, సంప్రదాయాలకు దిక్సూచిగా నిలిచే దేశంలో కూడా మహిళలకు ఆపదలు పెరిగిపోతున్న కాలంలో వారి భద్రత, రక్షణపై చైతన్యంతో కూడిన చర్చ అవసరం. స్త్రీ ఆత్మగౌరవంతో జీవించగల వాతావరణం ఎంత మేరకు ఉంది? రోడ్డుపై నడుస్తున్నా, వాహనాల్లో, ప్రయాణాల్లో, ఉద్యోగాల్లో, పాఠశాలల్లో... ఇలా అక్కడ, ఇక్కడ అని లేకుండా మహిళలను క్రూరమృగాల్లా వేధిస్తుండటం సమాజాన్ని కళంకితం చేస్తోంది. ఆఖరికి ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య కూడా స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి.భారత రాజ్యాంగం మహిళలకు సమానత్వం, హక్కులు కల్పించినా ఆ హక్కులను ఉపయోగించుకునే పరిస్థితి అందరికీ సమంగా లేదు. మహిళలందరికీ భద్రత, రక్షణ చట్టాలపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులు, సైబర్ స్టాకింగ్ వంటి నేరాలపై ఐపీసీ, 1860 ప్రకారం సెక్షన్ 354, సెక్షన్ 354ఏ–డీ, అత్యాచారానికి సంబంధించి సెక్షన్ 375, సెక్షన్ 376లు వర్తిస్తాయి. వివాహిత మహిళపై భర్త, కుటుంబసభ్యుల మానసిక, శారీరక వేధింపులకు సెక్షన్ 498ఏ వంటి చట్టాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా సెక్స్యువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ అట్ వర్క్‌ప్లేస్ యాక్ట్ (POSH), 2013; మైనర్ బాలికలకు రక్షణగా పాక్సో యాక్ట్ (POCSO), 2012 వంటి చట్టాల గురించి బాలికలకు తెలియజేయాలి.రాష్ట్రంలోని మహిళల హక్కులకు రక్షణ, భద్రత, సురక్షత, సాధికారత కోసం మహిళా కమిషన్ ఏర్పడింది. సివిల్ కోర్టుకి సమానమైన అధికారాలు కమిషన్‌కు ఉన్నాయని CPC 1908 ప్రకారం సెక్షన్ 14 చెబుతుంది. సెక్షన్ 16(1) ప్రకారం బాధిత మహిళల నుంచి వచ్చిన న్యాయబద్ధమైన ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు కమిషన్ తీసుకుంటుంది. సెక్షన్ 16(3) ప్రకారం ఎవరైనా అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తి కమిషన్ ముందు నిర్దేశించిన తేదీ నాడు విచారణకు హాజరు కాకపోతే, కమిషన్ ఆ విషయంపై విచారణ నిర్వహించి, అభియోగం నిరూపణ అయితే తగు చర్యకై ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చు, లేదా ప్రాసిక్యూషన్‌ను కూడా ప్రారంభించవచ్చు. సెక్షన్ 21 ప్రకారం ప్రభుత్వం మహిళలకు సంబంధించిన అన్ని విధానపరమైన నిర్ణయాలను తీసుకునే ముందు కమిషన్‌ను సంప్రదించాలి. గృహ హింస, లైంగిక వేధింపులు వంటి అంశాలను కమిషన్ పరిశీలించి పరిష్కార చర్యలు సూచిస్తుంది. సోషల్ మీడియా, ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలిసిన ఘటనలను సుమోటాగా స్వీకరించి సంబంధిత శాఖలకు సూచనలు చేస్తుంది. యూనివర్సిటీలు/ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.మహిళా కమిషన్ బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు అలుపెరగని కృషి చేస్తోంది. బాధిత మహిళలకు తోడుగా నిలిచేందుకు వన్ స్టాప్ సెంటర్లు, అత్యవసర పరిస్థితుల్లో 24/7 ఉచిత సేవలు అందించేందుకు మహిళా హెల్ప్‌లైన్ 181, శక్తి సదన్‌లు, శక్తి నివాస్ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అదే విధంగా ప్రభుత్వాసుపత్రుల్లో మహిళలు, గర్భిణిల వార్డులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి లోపాలను సరిచేస్తుంది. అధికారులతో సమీక్షలు నిర్వహించి సూచనలు చేస్తుంది.కొద్ది రోజుల క్రితం ఒక జిల్లా జీజీహెచ్‌లో 50 మంది వైద్య విద్యార్థినులపై లైంగిక దాడులకు పాల్పడిన సిబ్బందిపై ఆ విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి ఘటన వివరాలు చెప్పారు. ఇలాంటి ఘటనలు ఎంతో మంది మహిళలకు ధైర్యాన్ని ఇస్తాయి. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలను నిశితంగా పరిశీలిస్తే మోసగాళ్ల ఉచ్చులోపడి బాలికలు అన్యాయంగా బలైపోతున్నారు. చిన్నారి బాలికలు, చదువుకుంటున్న అమ్మాయిలు అనవసర సమస్యల్లో చిక్కుకొని తమ జీవితాలను చెడగొట్టుకుంటున్నారు. ప్రభుత్వం, సామాజిక సంస్థలు, ప్రజలు కలిసి బాలికల రక్షణకు చర్యలు తీసుకోవాలి.రాష్ట్రంలోని మహిళల హక్కులకు రక్షణ, భద్రత, సురక్షత, సాధికారత కోసం మహిళా కమిషన్ ఏర్పడింది. సివిల్ కోర్టుకి సమానమైన అధికారాలు కమిషన్‌కు ఉన్నాయని CPC 1908 ప్రకారం సెక్షన్ 14 చెబుతుంది. సెక్షన్ 16(1) ప్రకారం బాధిత మహిళల నుంచి వచ్చిన న్యాయబద్ధమైన ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు కమిషన్ తీసుకుంటుంది. సెక్షన్ 16(3) ప్రకారం ఎవరైనా అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తి కమిషన్ ముందు నిర్దేశించిన తేదీ నాడు విచారణకు హాజరు కాకపోతే, కమిషన్ ఆ విషయంపై విచారణ నిర్వహించి, అభియోగం నిరూపణ అయితే తగు చర్యకై ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చు, లేదా ప్రాసిక్యూషన్‌ను కూడా ప్రారంభించవచ్చు. సెక్షన్ 21 ప్రకారం ప్రభుత్వం మహిళలకు సంబంధించిన అన్ని విధానపరమైన నిర్ణయాలను తీసుకునే ముందు కమిషన్‌ను సంప్రదించాలి. గృహ హింస, లైంగిక వేధింపులు వంటి అంశాలను కమిషన్ పరిశీలించి పరిష్కార చర్యలు సూచిస్తుంది. సోషల్ మీడియా, ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలిసిన ఘటనలను సుమోటాగా స్వీకరించి సంబంధిత శాఖలకు సూచనలు చేస్తుంది. యూనివర్సిటీలు/ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.మహిళా కమిషన్ బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు అలుపెరగని కృషి చేస్తోంది. బాధిత మహిళలకు తోడుగా నిలిచేందుకు వన్ స్టాప్ సెంటర్లు, అత్యవసర పరిస్థితుల్లో 24/7 ఉచిత సేవలు అందించేందుకు మహిళా హెల్ప్‌లైన్ 181, శక్తి సదన్‌లు, శక్తి నివాస్ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అదే విధంగా ప్రభుత్వాసుపత్రుల్లో మహిళలు, గర్భిణిల వార్డులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి లోపాలను సరిచేస్తుంది. అధికారులతో సమీక్షలు నిర్వహించి సూచనలు చేస్తుంది.కొద్ది రోజుల క్రితం ఒక జిల్లా జీజీహెచ్‌లో 50 మంది వైద్య విద్యార్థినులపై లైంగిక దాడులకు పాల్పడిన సిబ్బందిపై ఆ విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి ఘటన వివరాలు చెప్పారు. ఇలాంటి ఘటనలు ఎంతో మంది మహిళలకు ధైర్యాన్ని ఇస్తాయి. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలను నిశితంగా పరిశీలిస్తే మోసగాళ్ల ఉచ్చులోపడి బాలికలు అన్యాయంగా బలైపోతున్నారు. చిన్నారి బాలికలు, చదువుకుంటున్న అమ్మాయిలు అనవసర సమస్యల్లో చిక్కుకొని తమ జీవితాలను చెడగొట్టుకుంటున్నారు. ప్రభుత్వం, సామాజిక సంస్థలు, ప్రజలు కలిసి బాలికల రక్షణకు చర్యలు తీసుకోవాలి.



# పరీక్ష తప్పానని భయం

మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలోని వసైలో మానవ అక్రమ రవాణాకు సంబంధించిన దిగ్భ్రాంతికరమైన కేసు వెలుగులోకి వచ్చింది. బంగ్లాదేశ్ కు చెందిన నుంచి వచ్చి లైంగిక దాడులకు గురైన బాలికను మీరా-భయందర్ పోలీసులు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు వసైలోని ఒక భవనం నుంచి రక్షించాయి.తనపై మూడు నెలల కాలంలో 200 మందికి పైగా లైంగిక దాడికి పాల్పడ్డారని బాధిత బాలిక చెప్పారు. ఎక్సోడస్ రోడ్ ఇండియా ఫౌండేషన్, హార్మొనీ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థలు బాలికకు అండగా నిలిచాయి.బాలికను మహారాష్ట్రలోని అహల్యానగర్, ముంబయి, వసై, గుజరాత్ లోని కొన్ని ప్రదేశాలకు తీసుకెళ్లి అత్యాచారం చేశారని పోలీసులు తెలిపారు.మీరా-భయందర్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, కొన్నిస్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 2025 జూలై 26న ఈ ఆపరేషన్ జరిగింది.బాధిత బాలిక బంగ్లాదేశ్ నుంచి వచ్చారు. మూడు నెలల కిందట పరీక్షల్లో ఫెయిల్ కావడంతో భయంతో ఇంటి నుంచి పారిపోయి వేరే గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి ఒక మహిళ తనను భారతదేశానికి తీసుకువచ్చారని బాధితురాలు పోలీసులకు తెలిపారు.ఈ కేసులో ఇప్పటివరకు పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై పోక్సో, పీఐటీఏ (ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫికింగ్ యాక్ట్) కింద కేసులు నమోదు చేశారు.బంగ్లాదేశ్‌లోని ఓ గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక పాఠశాల పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. దీంతో భయపడి ఇంటికి వెళ్లకుండా సమీపంలోని గ్రామానికి పారిపోయారు. అక్కడ ఆమె తన సొంత గ్రామానికి చెందిన మహిళను కలిశారు.బాధిత బాలిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో "ఆ మహిళ నన్ను రెండు రోజులు ఇంట్లో పెట్టుకుని, 'నువ్వు ఇంటికి వెళితే, మీవాళ్లు నిన్ను చంపేస్తారని' చెప్పి, బంగ్లాదేశ్ నుంచి రహస్యంగా కోల్‌కతాకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి, విమానంలో ముంబయికి తీసుకొచ్చారు. ఇక్కడ, ఐదు నుంచి ఆరుగురు బాలికలు నివసించే ఇంటికి తీసుకొచ్చారు. ఇక్కడికి చేరుకున్న తర్వాత, నాకొక ఇంజెక్షన్ ఇచ్చారు. నేను స్పృహలోకి వచ్చేసరికే, నాకు రక్తస్రావమై, కడుపులో నొప్పిగా ఉంది.ఈ విషయం గురించి ఆమెను అడిగితే.. 'నువ్వు మీ ఊరికి వెళ్లాలనుకుంటే, నువ్వొక పని చేయాల్సి ఉంటుంది' అని నాకు చెప్పారు. పని గురించి అడిగినప్పుడు, పురుషులతో లైంగిక సంబంధం పెట్టుకోవాల్సి ఉంటుందని' ఆమె చెప్పారు.''మా నాన్న ఊరికి తిరిగి రావడానికి డబ్బు పంపుతారని, నేనలాంటి పని చేయనని చెప్పాను. కానీ, వారు నాపై కత్తితో దాడి చేశారు, నా చేతులు, వీపుపై కూడా కొట్టారు" అని పేర్కొన్నారు.తన వీడియోను కూడా తీశారని ఆమె చెప్పారు. ప్రతిరోజూ వేర్వేరు పురుషులతో చెడు పనులు చేయించేవారని, ఈ పనికి చెల్లించిన డబ్బు కూడా తనకు ఇవ్వలేదని బాలిక తెలిపారు.''నెలరోజుల పాటు జరిగిన ఈ చిత్రహింసలతో అక్కడి నుంచి పారిపోవాలని నిర్ణయించుకున్నాను. 500 రూపాయలు తీసుకొని, స్టేషన్‌కు చేరుకున్నా. మా నాన్నకు ఫోన్ చేసి, నేను ఇంటికి రావాలనుకుంటున్నా అని చెప్పాను. మా నాన్న ఒక వ్యక్తిని కలవమన్నారు, ఆయనను కలిసిన తర్వాత, ఆయన నన్ను వసైలోని నాయిగావ్‌కు తీసుకువచ్చారు.ఈ వ్యక్తి కూడా నన్ను అదే పని చేయమని అడిగారు. నన్ను మా ఊరుకు తీసుకువెళ్లనని ఆయన చెప్పారు. నేను పని చేయనంటే నన్ను కొట్టేవారు. పురుషులను గదికి తీసుకువచ్చేవారు. నన్ను ఇతర ప్రదేశాలకు కూడా తీసుకెళ్లేవారు. 10 నుంచి 12 గంటలు రైలులో ప్రయాణం ఉండేది" అని బాధిత బాలిక తన ఫిర్యాదులో పేర్కొన్నారు.తన తండ్రి సంబంధిత వ్యక్తికి చాలాసార్లు ఫోన్ చేసి, గ్రామానికి పంపాలని కోరారని బాలిక చెప్పారు. బాలిక తండ్రి కూడా సంబంధిత వ్యక్తిపై బంగ్లాదేశ్‌లోని ఖుల్నా మోడల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఇదే ఆపరేషన్‌లో మరో 21 ఏళ్ల బంగ్లాదేశ్ అమ్మాయిని కూడా పోలీసులు రక్షించారు. ఐదారేళ్ల కిందట బంగ్లాదేశ్ నుంచి వచ్చానని ఆమె చెప్పారు.జూలై 26 ఉదయం వసై-విరార్ పోలీస్ కమిషనరేట్‌లోని 'ఇమ్మోరల్ హ్యూమన్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ సెల్'కు బాలిక గురించిన సమాచారం అందింది.వసైలోని ఒక భవనంలో కొంతమంది బ్రోకర్లు బంగ్లాదేశ్‌కు చెందిన బాలికను వ్యభిచారంలోకి దింపారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. ఇప్పటివరకు, ఈ కేసులో ముగ్గురు బంగ్లాదేశీయులతో సహా పది మందిని అరెస్టు చేశారు. బాధిత బాలికను రిమాండ్ హోమ్‌కు పంపారు.పోలీస్ ఇన్‌స్పెక్టర్ అభిజిత్ మాద్గే మాట్లాడుతూ, "మొత్తం రెండు దాడులు జరిగాయి. మొదటి దాడిలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, ఇద్దరు బాధితులను రక్షించాం. రెండవ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి, మరో ముగ్గురు బాధితులను రక్షించాం. ఈ బాధితుల్లో ఒకరు 12 ఏళ్ల బాలిక ఉన్నారు. తన ఫోన్‌ను తీసుకున్నారని ఆమె చెప్పారు. బాలికను తీసుకువచ్చిన మహిళ పూర్తి పేరు ఆమెకు తెలియదు" అన్నారు."సదరు మహిళ ఆమెను వసైకి తీసుకువచ్చారు. ముంబయిలోని ఒక ప్రాంతంలో ఉంచారు. ఆమెపై అత్యాచారం జరిగింది. బాలిక అక్కడి నుంచి తప్పించుకున్నారు, రిక్షావాళ్లు ఆమె తండ్రికి ఫోన్ చేశారు. తండ్రి ఆమెకు బంగ్లాదేశ్ పౌరుడి వివరాలు ఇచ్చారు. అయితే, ఆయన కూడా వ్యభిచార వ్యాపారం నడిపేవారే. దీంతో, డబ్బు అవసరమని చెప్పి ఆమెను ఒక బ్రోకర్ వద్దకు పంపారాయన. మాకు సమాచారం అందడంతో, దాడులు నిర్వహించాం. బాలికను రక్షించాం.బాలికపై ఎంతమంది లైంగిక దాడి చేశారో ఇంకా తెలియదు. సంఘటన ఒక నిర్దిష్ట ప్రదేశంలో జరిగి ఉంటే, అది తెలిసి ఉండేది. కానీ, ఒక బ్రోకర్ నుంచి మరో బ్రోకర్ ఇలా వేర్వేరు ప్రదేశాలలో ప్రారంభమైంది. ఆమెను పది రోజుల పాటు గుజరాత్‌కు, తరువాత అహల్యానగర్‌కు తిప్పారు. గుజరాత్‌లో ఇచ్చిన చిరునామాలో అక్కడి నుంచి ఒక మహిళను అరెస్టు చేశారు. అలాగే, అహల్యానగర్‌లో పలువురిని అరెస్టు చేశాం. కొల్హాపూర్‌కు కూడా ఒక బృందాన్ని పంపాం" అని అభిజిత్ మాద్గే అన్నారు."వైద్య పరీక్షలో బాలిక చేతులపై గాయాలు ఉన్నట్లు తేలింది" అని ఆయన తెలిపారు.బాధిత బాలిక గురించి హార్మొనీ ఫౌండేషన్ అనే ఎన్జీఓ ఒక ప్రకటన విడుదల చేసింది.హార్మొనీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ అబ్రహం మథాయ్ మాట్లాడుతూ "2025 జూలై 26న, వసైలోని నాయిగావ్‌లో 12 ఏళ్ల బాలికను వ్యభిచారం నుంచి రక్షించారు. రిమాండ్ హోమ్‌లో ఉన్న బాలిక ఇచ్చిన సమాచారం ప్రకారం, ఆమెను గుజరాత్‌లోని నాడియాద్‌కు అక్రమ రవాణాదారులు తీసుకెళ్లారు. మూడు నెలల్లో వివిధ ప్రదేశాలలో తిప్పుతూ 200 మందికి పైగా బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు" అని తెలిపారు."ఇటువంటి క్రూరత్వాన్ని అస్సలు సహించకూడదు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారందరిపై చర్యలు తీసుకోవాలి" అని అబ్రహం డిమాండ్ చేశారు.

# ఏ దేశంతో ఒప్పందాలు ప్రయోజనకరం?



దశాబ్దాలుగా రష్యా, అమెరికా రెండు దేశాలు భారత్ కు ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు భారత్ ఎవరివైపు ఉంటే ప్రయోజనం కలుగుతుందనే ప్రశ్నను తీవ్రతరం చేసింది.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ భారత్ పై అదనంగా 25 శాతం సుంకాన్ని విధించారు. దీంతో ఇది ఇప్పటికే వర్తించే 25 శాతం సుంకంతో కలిపి 50 శాతానికి చేరింది.రష్యాతో భారత్ కు చాలా ఏళ్లుగా సత్సంబంధాలున్నాయి. రక్షణ ఒప్పందాల నుంచి ఇంధన సరఫరాల వరకు, రష్యా భారతదేశానికి ముఖ్యమైన భాగస్వామిగా ఉంది.స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ (ఎస్ఐపీఆర్ఐ) ప్రకారం, 2019, 2023 మధ్య రష్యా నుంచి భారత ఆయుధ దిగుమతులు 36 శాతంగా ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాలలో, రష్యా నుంచి వస్తున్న చౌకైన ముడి చమురు భారత ఆర్థిక వ్యవస్థకు భారీ ఉపశమనం కలిగించింది.మరోవైపు, భారత్ కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2024-25లో రెండు దేశాల మధ్య వాణిజ్యం రూ.12 లక్షల కోట్లకు పైగా ఉంది. అదే సమయంలో, హైటెక్ రక్షణ పరికరాల నుంచి క్లీన్ ఎనర్జీ వరకు అమెరికాపై భారత్ ఆధారపడటం పెరిగింది.కానీ అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే, అమెరికా, రష్యాలలో ఎవరి మద్దతు భారత్‌కు ఎక్కువ ప్రయోజనకరం?భారత్ తన మొత్తం చమురు అవసరాలలో దాదాపు 88 శాతం దిగుమతి ద్వారానే భర్తీ చేసుకుంటోంది.వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత మొత్తం చమురు దిగుమతుల్లో దాదాపు 35 శాతం రష్యా నుంచి వచ్చాయి. అయితే 2018లో ఇది 1.3 శాతం మాత్రమే.యుక్రెయిన్ యుద్ధం తర్వాత, పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించాయి. దీంతో, రష్యా చౌక ధరలకే చమురును అమ్ముతోంది, ఇది భారత్‌కు ప్రయోజనకరంగా మారింది.రష్యా నుంచి భారత్ చౌకగా చమురును కొనుగోలు చేసి, ఏటా దాదాపు రూ. 87 వేల కోట్ల రూపాయల వరకు ఆదా చేస్తోందని సెర్చ్ గ్రూప్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అంచనా వేశారు."మరోవైపు, అమెరికాతో భారత్‌కు దాదాపు రూ. 3.5 లక్షల కోట్ల రూపాయల వాణిజ్య మిగులు ఉంది(ఎక్కువ ఎగుమతులు, తక్కువ దిగుమతులు). భారత్ అమెరికాకు దాదాపు రూ. 7.6 లక్షల కోట్ల రూపాయల విలువైన వస్తువులను ఎగుమతి చేస్తున్నాం" అని ఆయన అన్నారు."ట్రంప్ 50 శాతం సుంకం కొనసాగితే, భారత్ నుంచి దాదాపు 4.37 లక్షల కోట్ల రూపాయలు విలువజేసే ఎగుమతులు తగ్గవచ్చు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకపోతే, ఈ సుంకం 25 శాతమే ఉంటుంది. అప్పుడు, 2.62 లక్షల కోట్ల రూపాయలు విలువజేసే ఎగుమతులు మాత్రమే తగ్గుతాయి" అని అజయ్ శ్రీవాస్తవ అంటున్నారు.'ది ఇమేజ్ ఇండియా ఇనిస్టిట్యూట్' ప్రెసిడెంట్ రవీంద్ర సచ్‌దేవ్ కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు."అమెరికన్ సుంకంలో ఒక శాతం అంటే దాదాపు రూ.8,700 కోట్లు. ట్రంప్ 50 శాతం సుంకం విధిస్తే, భారత్ దాదాపు రూ. 4.37 లక్షల కోట్ల రూపాయల నష్టాన్ని చవిచూస్తుంది" అని రవీంద్ర సచ్‌దేవ్ అంచనా వేశారు."భారత్‌లో డబ్బు మాత్రమే కాదు, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కూడా పోతాయి. సుంకాలు పెరిగితే, తక్కువ వస్తువులు అమెరికాకు వెళతాయి. దేశంలో వాణిజ్యం ప్రభావితమవుతుంది, ఉద్యోగాలు పోతాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా 50 శాతం సుంకాన్ని కొనసాగిస్తే, భారత్‌లో 50 లక్షల ఉద్యోగాల వరకు కోల్పోవచ్చని రవీంద్ర సచ్‌దేవ్ అంచనా వేస్తున్నారు.రెండు దేశాల మధ్య నిర్ణయాలు ఆర్థిక దృక్పథం నుంచి మాత్రమే తీసుకోరని, భౌగోళిక రాజకీయాలు, దౌత్యం, జాతీయ ప్రయోజనాలకు కూడా ప్రాధాన్యమిస్తారని విదేశాంగ విధాన నిపుణులు భావిస్తున్నారు.ట్రంప్ ఒత్తిడితో భారత్ నిర్ణయం తీసుకోకూడదని నికోర్ అసోసియేట్స్‌లో ఆర్థికవేత్త మితాలి నికోర్ అభిప్రాయపడ్డారు.అదే సమయంలో, ట్రంప్ ఒత్తిడితో భారతదేశం రష్యాతో తన సంబంధాలను చెడగొట్టుకోకపోవచ్చని అజయ్ శ్రీవాస్తవ నమ్ముతున్నారు.అజయ్ శ్రీవాస్తవ చెబుతున్నదాని ప్రకారం.. "సంక్షోభ సమయాల్లో, భారత్‌కు అమెరికా కంటే రష్యానే ఎక్కువ సహాయం చేసిందని చరిత్ర చెబుతోంది".1971 ఇండో-పాకిస్తాన్ యుద్ధంలో రష్యా భారతదేశానికి సైనిక ఆయుధాలు, దౌత్యపరమైన మద్దతును అందించింది. ఐక్యరాజ్యసమితిలో భారత్ వైపు నిలిచింది. మరోవైపు, అమెరికా బహిరంగంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చింది, హిందూ మహాసముద్రంలో ఇండియాపైకి తన 7వ నౌకాదళాన్ని పంపింది.1998లో అణు పరీక్ష తర్వాత కూడా, భారత్‌కు రష్యా ఆయుధాలను సరఫరా చేస్తూనే ఉంది. పాశ్చాత్య దేశాలు భారతదేశంపై ఆంక్షలు విధించిన సమయమది."2024లో రష్యా నుంచి చైనా రూ. 5.47 లక్షల కోట్ల విలువైన చమురు కొనుగోలు చేసింది. భారత్ రూ.4.6 లక్షల కోట్ల విలువైన చమురు కొనుగోలు చేసింది. అయినప్పటికీ, చైనాపై సుంకం లేదు, ఎందుకంటే ఈ సమస్య చమురు గురించి మాత్రమే కాదు" అని శ్రీవాస్తవ అన్నారు."ప్రస్తుతం చమురు సమస్య ఉంది, రేపు బ్రిక్స్ విషయంలో భారత్‌పై అమెరికా ఒత్తిడి తీసుకురావచ్చు, వాణిజ్య ఒప్పందాన్ని ఒక షరతుగా చేయవచ్చు. అటువంటి పరిస్థితిలో, అమెరికా ఏకపక్ష పరిస్థితులను భారత్ అంగీకరించదు" అని మితాలి నికోర్ అభిప్రాయపడ్డారు.భారత విదేశాంగ విధానం మొదటి నుంచి అలీనంగా ఉంది. స్వతంత్ర, నిష్పాక్షిక వైఖరిని కొనసాగించింది."రష్యా నుంచి భారత్ ఎంతకాలం చౌకగా చమురు పొందుతుందనేదే ఇపుడు ప్రశ్న. ఇక్కడ చమురు తాత్కాలిక విషయం. రక్షణ రంగంలో రష్యా, భారత్ ఏళ్లుగా స్నేహితులు. చమురు కొనకపోవడం వల్ల భారత సంబంధాలేం చెడిపోవు. రష్యా, అమెరికాల మధ్య భారత్ సమతుల్యతను కొనసాగించాలి" అని అజయ్ శ్రీవాస్తవ సూచించారు.రవీంద్ర సచ్‌దేవ్ కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు. ఈ సుంకాల యుద్ధం ఎక్కువ కాలం ఉండదని ఆయన నమ్ముతున్నారు."భారతదేశానికి అమెరికా మాత్రమే ముఖ్యం కాదు, అమెరికాకూ భారత్ ముఖ్యమే. చైనా దానికి అతిపెద్ద సవాలు, దీనికి భారత మద్దతు అవసరం" అని రవీంద్ర సచ్‌దేవ్ అన్నారు."భారత మార్కెట్ అమెరికాకు చాలా పెద్దది. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.43.7 లక్షల కోట్లకు తీసుకెళ్లాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అమెరికా కార్పొరేట్ లాబీ కూడా సుంకానికి వ్యతిరేకంగా ట్రంప్‌పై ఒత్తిడి తెస్తోంది" అని ఆయన అన్నారు."ఇవి కష్ట సమయాలు, భారత్ ఈ విషయంలో బలంగా ఉండాలి. అమెరికాలోని చాలామంది రిపబ్లికన్లు ట్రంప్ చర్యలను ప్రశ్నిస్తున్నారు. అంతర్గతంగా అక్కడ జరుగుతున్నది ఇండియాకు మంచిదే" అని మితాలీ నికోర్ అన్నారు."ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి, భారత్‌కు అనుకూలంగా మాట్లాడుతున్న అమెరికన్లతో మనం బ్యాక్ చానల్ చర్చలు జరపాలి" అని ఆమె సూచించారు.భారత్ మొత్తం ఎగుమతుల్లో దాదాపు 18 శాతం అమెరికాకు వెళ్తాయి."మనం ఒకే దేశంపై అంతగా ఆధారపడకూడదు. ఎగుమతి కోసం యూరప్, జపాన్, ఆస్ట్రేలియా, యూఏఈ వంటి పెద్ద దేశాలతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలి" అని మితాలీ నికోర్ సూచించారు."భారత్ ప్రతి సంవత్సరం దాని రూ. 25 వేల కోట్ల విలువైన రొయ్యలలో 40 శాతం అమెరికాకు పంపుతుంది. ప్రస్తుతం భారతదేశం యూకేతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసింది. దీంతో భారత్ తన రొయ్యలను యూకేకూ పంపగలదు. అక్కడ కూడా మంచి డిమాండ్ ఉంది. ఈ విధంగా, భారత్ తన వస్తువులకు ఇతర మార్కెట్లను కనుగొనగలదు" అని ఆమె అన్నారు."భారత్ తన వ్యాపారులను బలోపేతం చేసుకోవాలి, తద్వారా కొత్త మార్కెట్లను కనుగొనవచ్చు. ప్రభుత్వం చిన్న వ్యాపారులకు కూడా మద్దతివ్వాలి, దీంతో మేక్ ఇన్ ఇండియాను బలోపేతం చేయవచ్చు, ఇది విదేశాలపై మనం ఆధారపడటాన్ని తగ్గిస్తుంది" అని మితాలీ నికోర్ సూచించారు.అయితే, ఎగుమతి మార్కెట్‌ను మార్చడం అంత సులభం కాదని రవీంద్ర సచ్‌దేవ్ అంటున్నారు."భారత్ తన ఎగుమతులను కొంతవరకు వివిధ ప్రాంతాలకు తరలించగలదు కానీ, అదంత సులభం కాదు. అమెరికా చాలా పెద్ద మార్కెట్, ప్రపంచంలో అలాంటి మార్కెట్‌ను కనుగొనడం కష్టం" అని ఆయన అంటున్నారు.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ప్రసవానికి ఎన్ని కష్టాలు..!

- గిరిజనులకు తప్పని కష్టాలు..
- రహదారి సౌకర్యం లేక వర్షంలో కిలోమీటర్ కాలినడక..
- 4 కిలో మీటర్లు డోలీలో గర్భిణి ప్రయాణం..
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చింతలపాలెంలో ఘటన..



**ఆంధ్రప్రదేశ్ :** గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదు.. ప్రభుత్వాలు మారినా.. కొత్త పీఎంలు వచ్చినా.. నయా ముఖ్యమంత్రులు పీఠాలు ఎక్కినా.. ఇంకా.. కనీస సౌకర్యాలకు ఆమడం దూరంలోనే బతుకులు వెళ్లదీస్తున్నారు.. చివరకు అనారోగ్యం చేసి ఆస్పత్రికి వెళ్లాలన్నా.. ప్రసవం కోసం పెద్దాస్పత్రిలో చేరాలన్నా.. ఇంకా వాళ్లు డోలీని ఆశ్రయించాల్సిన పరిస్థితి.. తాజాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో గర్భిణికి డోలీమోత తప్పలేదు.. అనంతగిరి మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ చింతలపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం లేక నిండు గర్భిణిని ఆస్పత్రికి డోలీలో తరలించిన సంఘటన చోటు చేసుకుంది.చింతలపాలెం గ్రామానికి చెందిన కొర్రా జానకి నిండు గర్భిణీ.. ఆమెకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. అయితే, గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో, కుటుంబ సభ్యులు ఆమెను డోలీలో ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమయ్యారు. చింతలపాలెం నుంచి సుమారు కిలోమీటరు మేర డోలీపై తీసుకు వచ్చారు. బూసిపుట్టు సమీపంలోకి వచ్చేసరికి పూర్తిగా దారిలేకపోవడం, వర్షాలకు కొండవాలును ఆనుకుని వరద నీరు ప్రవహించడంతో సుమారు కిలోమీటరు మేర నిండు గర్భిణిని నడిపించాల్సి వచ్చింది. అక్కడ నుంచి కొండిభకోట వరకు నాలుగు కిలోమీటర్లు డోలీలో మోసుకువచ్చి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను అతి కష్టం మీద దాటించారు. అక్కడ నుంచి కొంతదూరం మోసుకు వచ్చి రేగుళ్లపాలెం మెయిన్ రోడ్డు నుంచి ఫీడర్ అంబులెన్స్ ద్వారా ఆమెను ఆస్పత్రికి తరలించారు. రహదారి లేక అష్టకష్టాలు పడుతున్నామని, ఇప్పటికైనా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు..

# ఓట్ల చోరీపై గళమెత్తండి..

## సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ క్యాంపెయిన్

**న్యూఢిల్లీ:** దేశంలో 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో కాంగ్రెస్ క్యాంపెయిన్ షురూ చేసింది. దీనిపై ప్రతి ఒక్కరూ గళమెత్తాలని పిలుపునిచ్చింది. బీజేపీ కబంధ హస్తాల నుంచి రాజ్యాంగాన్ని కాపాడాలని కోరింది. దొంగ ఓట్లు ఎలా వేస్తారనే దానిపై రూపొందించిన వీడియోను కాంగ్రెస్ బుధవారం విడుదల చేసింది. ఇద్దరు భార్యాభర్తలు ఓటు వేసేందుకు పోలింగ్ బూత్ లోకి వెళ్తుంటే.. ఇద్దరు వ్యక్తులు వస్తారు. 'మీ ఓట్లు పోలైనయ్.. వెళ్లిపోండి' అని చెప్తారు అయినా పోలింగ్ అధికారి మౌనంగా ఉన్నట్టుగా వీడియోలో చూపించారు. నిమిషం పాటు ఉన్న ఈ వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'మన ఓటు చోరీకి గురవుతున్నదంటే.. మనం అధికారం, గుర్తింపును కోల్పోయినట్టే' అని ఆయన పేర్కొన్నారు.ఇదే వీడియోను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే షేర్ చేసి.. "మీ ఓటు హక్కును లాక్కోనివ్వకండి. దీనిపై ప్రశ్నించండి.. సమాధానం కోసం డిమాండ్ చేయండి" అని పిలుపునిచ్చారు. ప్రియాంక గాంధీ కూడా వీడియోను షేర్ చేసి.. "ఓటును దొంగిలిస్తున్నారంటే.. మీ హక్కులను, ఐడెంటిటీని దొంగిలిస్తున్నట్టే. ఓటు హక్కును కాపాడుకోండి.. ఓట్ల దోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తండి" అని పిలుపునిచ్చారు.

**ఆ ఏడుగురితో చాయ్ తాగిన రాహుల్**

బిహార్ లో ఏడుగురు ఓటర్లు చనిపోయారంటూ ఓటర్ లిస్ట్ నుంచి వారి పేర్లను ఈసీ తొలగించిందని.. కానీ వారంతా బతికే ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. బుధవారం తనను కలిసిన ఆ ఏడుగురితో కలిసి చాయ్ తాగానని, 'డెడ్ ఓటర్ల'తో చాయ్ తాగే అరుదైన అనుభవాన్ని కల్పించిన ఈసీకి ధన్యవాదాలు అంటూ ఆయన ట్వీట్ చేశారు. వారితో ఇంటరాక్ట్ అయిన వీడియో క్లిప్ ను 'ఎక్స్'లో షేర్ చేశారు. కాగా, తామంతా ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ నియోజకవర్గానికి చెందిన ఓటర్లమని, బతికే ఉన్నామని చెప్పేందుకే వచ్చామని వారు చెప్పారు.

**అతడి నుంచి నాకు ప్రాణహాని ఉంది..**

పరువు నష్టం కేసులో ఫిర్యాదుదారుడి నుంచి తనకు ప్రాణహాని ఉందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషయాన్ని బుధవారం పుణె కోర్టుకు తెలిపారు. మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో 2022, నవంబర్ 17న భారత్ జోడో యాత్ర సందర్భంగా వీడీ సావర్కర్ ను బ్రిటీష్ సర్వెంట్ అని విమర్శించారు. దీంతో రాహుల్ పై పరువు నష్టం కేసు నమోదైంది. ఈ కేసులో రాహుల్ తరపున న్యాయవాది మిలింద్ పవార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల తాను లేవనెత్తిన రాజకీయ సమస్యలు, గతంలో సావర్కర్ పై చేసిన వ్యాఖ్యలతో తన భద్రతపై భయాలు ఉన్నాయన్నారు. ఫిర్యాదుదారుడైన సాత్యకి సావర్కర్.. మహాత్మా గాంధీ హంతకుడు నాథూరామ్ గాడ్సే ప్రత్యక్ష వారసుడని తెలిపారు. ఫిర్యాదుదారుడి వంశానికి హింస, రాజ్యాంగ వ్యతిరేక ధోరణుల చరిత్ర ఉందని పేర్కొన్నారు.

# ఏపీలో భారీ వర్షాలు..

- బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం..
- రాబోయే 48 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం..
- దీని ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు..

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.. వాగులు, వంకలు, చెరువులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి.. ఇక, పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో అదే ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం.. ఇది రాబోయే 48 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది.. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిస్తోంది..ఈ రోజు ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.. ఇక, ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలు.. మరోవైపు, పై నుంచి వస్తున్న వరదలతో కృష్ణానదిలో వరద ప్రవాహం పెరుగుతుంది.. ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5,20,531 క్యూసెక్కులుగా ఉంది.. దీంతో, కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎంపీ ప్రఖర్ జైన్..

# రాయికి బదులుగా కిడ్నీని తొలగించిన ఘనులు

## కడుపు నొప్పి చికిత్స కోసం ఆసుపత్రికి వెళితే..

**థానా :** కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిందన్నట్లుగా.. కడుపు నొప్పి చికిత్స కోసం హాస్పిటల్ కు పోతే ఏకంగా కిడ్నీనే తొలగించారు అక్కడి ఘనులు. థానాలోని కొత్వాల్లో ఉన్న న్యూ లైఫ్ కేర్ హాస్పిటల్ లో కిడ్నీలో రాళ్ల చికిత్స కోసం వెళ్లిన రోగి కిడ్నీని తొలగించిన సంచలనాత్మక కేసు వెలుగులోకి వచ్చింది. ఎస్పీ సూచనల మేరకు పోలీసులు ఆపరేటర్ తో సహా ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గత సోమవారం బాధితురాలు ఎస్పీ సంతోష్ మిశ్రాను కలిసి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీఓ ఖడ్డా బసంత్ కుమార్ సింగ్, SHO దీపక్ సింగ్ ఆసుపత్రికి చేరుకుని ఈ ఘటనపై దర్యాప్తు చేశారు. ఫిర్యాదు ఆధారంగా మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. రాంపూర్ ఖుర్ద్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయ్ తోలాకు చెందిన 35 ఏళ్ల అలావుద్దీన్ కడుపు నొప్పిగా ఉందని తెలిపాడు. 2025 ఏప్రిల్ 14న, అతను చికిత్స కోసం న్యూ లైఫ్ కేర్ ఆసుపత్రికి వెళ్ళాడు. అక్కడ ఆపరేటర్లు ఇమాముద్దీన్, తార్ మొహమ్మద్ కిడ్నీ స్టోన్ కు తక్షణ శస్త్రచికిత్స చేస్తామని చెప్పి అతన్ని చేర్పించారు. ఆపరేటర్లు సర్జన్ లేకుండా రాత్రిపూట స్వయంగా ఆపరేషన్ చేశారు.కొన్ని రోజుల తరువాత, రోగి ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారినప్పుడు, అతను మళ్ళీ ఆసుపత్రికి వెళ్ళాడు. అక్కడ అల్ట్రాసౌండ్ టెస్ట్ లో ఒక మూత్రపిండం కనిపించలేదని వెల్లడైంది. దీంతో ఆ వ్యక్తి షాక్ కు గురయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ హెచ్ ఓ తెలిపారు. కిడ్నీ తొలగింపు ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# ధర్మస్థలలో కొనసాగుతున్న తవ్వకాలు

- ధర్మస్థలలో 13వ పాయింట్‌లో జీపీఆర్ టెక్నాలజీ స్కానింగ్ చేసిన ప్రదేశంలో తవ్వకాలు
- మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల దాకా ప్రక్రియ కొనసాగింది.
- ఓవైపు వర్షం కురుస్తున్నా తవ్విన ప్రాంతంలో నీరు వస్తుండడంతో
- మోటార్లతో తొలగించి ప్రక్రియ కొనసాగిస్తున్నారు.



**బెంగళూరు:** ధర్మస్థలలో 13వ పాయింట్ లో జీపీఆర్ టెక్నాలజీ స్కానింగ్ చేసిన ప్రదేశంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల దాకా ప్రక్రియ కొనసాగింది. ఓవైపు వర్షం కురుస్తున్నా తవ్విన ప్రాంతంలో నీరు వస్తుండడంతో మోటార్లతో తొలగించి ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బుధవారం కూడా అదే పాయింట్ లో తవ్వకాలు కొనసాగించారు. ధర్మస్థళలో మృతదేహాలు పాతిపెట్టారని మాకూ సమాచారం ఉందని స్థానికులు పురందరగౌడ, తుకారాంగౌడలు బుధవారం సిట్ కార్యాలయానికి వచ్చారు. పురందరగౌడ మాట్లాడుతూ నేత్రావతి స్నానఘట్టం సమీపంలో ఓ దుకాణం నిర్వహించేవాడినన్నారు.మృతదేహాలను ఓ వ్యక్తి పూడ్చిపెట్టడం చూశానన్నారు. ఇదే వ్యక్తి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తం చేశారు. వారిద్దరునుంచి కూడా పోలీసులు ఆధారాలు తీసుకున్నారు. కాగా అనన్యభట్ తల్లి సుజాతభట్ ఇటీవల సిట్ అధికారులను కలసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మంగళూరులో ఎంబీబీఎస్ చదువుతున్న అనన్యభట్ ధర్మస్థల సందర్శనకు వచ్చి ఆ తర్వాత మృతి చెందారనే విషయమై తల్లి ఫిర్యాదు చేశారు. సిట్ అధికారులను కలసిన తర్వాత సుజాతభట్ కనిపించకుండా పోయారని ప్రచారం సాగింది. దీంతో సుజాతభట్ బుధవారం అజ్ఞాతస్థలం నుంచి వీడియోద్వారా వివరణ ఇచ్చారు.నేనెక్కడికీ వెళ్లలేదని తేల్చి చెప్పారు. కుమార్తె అనన్యభట్‌కు సంబంధించిన ఆనవాళ్లు లభిస్తే హిందూ సంప్రదాయం ప్రకారం ధార్మిక కార్యక్రమాలు చేపట్టాలని ఆమె ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ధర్మస్థళకు ఉండే మంచిపేరును చెడగొట్టేందుకు కుట్ర పన్నారని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. బెళగావి జిల్లా చిక్కోడి, బెళగావిలలో మహిళలు ఆందోళన చేశారు. ముస్లిం మహిళలు కూడా పాల్గొన్నారు. చిక్కోడి నగరంలో బంద్ చేస్తామని హెచ్చరించారు. బెళగావి, చామరాజ నగర, గదగ్, కలబురగి, మైసూరు, తుమకూరులలో ఆందోళనలు కొనసాగాయి.

# ఉగ్రరూపం దాల్చిన కాగ్నానది..

**తాండూరు ,ఫ్లాష్ ఇండియా :** కాగ్నా నది పొంగిపొర్లడంతో వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం, జీవన్గిలోని మహాదేవ లింగేశ్వర దేవాలయం జలగిగ్భంధంలో ఉండిపోయింది. కాగ్నానది ఉధృతంగా ప్రవహించడంతో ఒడ్డున ఉన్న ఈ దేవాలయం మునిగిపోయింది. ఆగి ఉన్న ప్రైవేట్ స్కూల్ బస్సును వరద నీటి ధాటికి తాళ్లతో కట్టేశారు. నదికి సమీపంలో ఉన్న ఇళ్లలోకి వరద నీరు వస్తుందేమో అని భయాందోళనకు గురయ్యారు స్థానికులు. తాండూరు మండలం వీర్ శెట్టిపల్లి గ్రామం బుధవారం అర్ధరాత్రి నుంచి జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామం చుట్టూ కాగ్నా నది ప్రవహించడంతో ఆ గ్రామానికి బాహ్య ప్రపంచం నుండి సంబంధాలు తెగిపోయాయి. ఇదిలా ఉండగా వరద కారణంగా చిక్కుకుపోయిన ప్రజలకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.యాలల్ మండలం జుంటిపల్లి ప్రాజెక్ట్ ఉప్పొంగిపోతోంది. ఆయకట్టు కింద ఉన్న వరి పంట పోలాల్లోకి వరద చేరడంతో పంటలు నాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వనాథ్ పూర్ బ్రిడ్జి పై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. అలాగే తాండూరు కోకట్, కోట్ పల్లి కాగ్నానది ఉగ్రరూపంగా ప్రవహిస్తుంది. తాండూరు ప్రాంతంలో ఉన్న పలు వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురుస్తున్న భారీ వర్షానికి వికారాబాద్ జిల్లాలోని తాండూరు కాగ్నా నది ఉగ్రరూపం దాల్చింది. తాండూరు ప్రాంతంలో పత్తి, కంది, పెసరు, వరి పంటలన్నీ నీటిలో మునిగాయి. రైతులు పంటలు నష్టపోయారు.

# సృజనాత్మకతకు పట్టం కడుతున్న ప్రభుత్వ పాఠశాలలు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కొందరు ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా, కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, భిన్నమైన పద్ధతుల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కృషి చేస్తున్నారు. అలాంటి కొన్ని ప్రభుత్వ స్కూళ్లపై దిశ ప్రత్యేక కథనం.నల్లగొండ జిల్లాలోని తంగడపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నారు. హెచ్ఎం ఈ చానల్ రూపొందించగా, ఉపాధ్యాయులు కలిసికట్టుగా పనిచేస్తూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెంచేందుకు ప్రార్థన సమయంలో హరివిల్లు పేరుతో కథలు చెప్పిస్తున్నారు. మంచు లక్ష్మి ఫౌండేషన్ ద్వారా స్మార్ట్ తరగతిని, దాతల సహకారంతో డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు వినూత్న బోధన అందిస్తున్నారు. బడిలో నిర్వహించే వినూత్న కార్యక్రమాలను తమ పాఠశాల చానల్ ద్వారా ప్రజలందరికి తెలియజేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యార్థుల్లో దాగి ఉన్న స ృజనాత్మకతను వెలికితీసేందుకు వారితో ఉత్తరాలు, కవిత్వం వంటివి రాయిస్తున్నారు. 'అవ్వ- తాతలకు ఉత్తరం రాద్దాం..' అనే కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తెలుగు ఉపాధ్యాయులు సహకారం అందిస్తున్నారు. ఉత్తరాలను ఉపాధ్యాయులతో కలిసి పోస్టాఫీసుకు వెళ్లి పోస్టు చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో బాగా రాసిన వారిని ముగ్గురిని ఎంపిక చేసిన బహుమతులు అందిస్తున్నారు.పెద్దపల్లి జిల్లా సుల్తానబాద్ మండలం గర్రెపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బ్యాంకు నడిపిస్తున్నారు. విద్యార్థులు తమ పాకెట్ మనీని ఇందులో దాచుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఇది వారికి ఆర్థిక క్రమశిక్షణను నేర్పుతోంది. తల్లిదండ్రులు ఇచ్చిన నగదును పాఠశాల బ్యాంకులో జమ చేసుకుని రోజు 45 నిమిషాలు బ్యాంకు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. పిల్లల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందిండానికి ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. విద్యార్థుల్లో బ్యాంకింగ్ సెక్టార్ పై చిన్ననాటి నుంచే అవగాహన కల్పిస్తే ఆ అంశాలు వారి కెరియర్ కు ఉపయోగపడతాయని అంటున్నారు. ఇందులో విద్యార్థులే బ్యాంకు మేనేజర్, అకౌంటెంట్, క్యాషియర్ గా విధులు నిర్వహిస్తారు. చిన్ననాటి నుంచే ఫామ్ నింపడం, డిపాజిట్, విత్ డ్రా చేయడం, కేవైసీ చేయడం వంటి అంశాలు తమకు తెలిశాయని విద్యార్థులు చెబుతుండడం మంచి పరిణామమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పిల్లలు జంక్ ఫుడ్, దురలవాట్లకు గురికాకుండా పాకెట్ మనీ స్కూల్ బ్యాంకులో దాచుకోవడం మంచి పరిణామమని తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం ప్రార్థన సమయంలో ఎఫ్ఎం రేడియో ద్వారా నిత్యం తాజా వార్తలు, కరెంట్ అఫైర్స్ వినిపిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడంతో పాటు, వారి సాధారణ విజ్ఞానం పెరుగుతుంది. ఈ వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ప్రయోగాత్మక పద్ధతులు భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని వారు అంటున్నారు.

# జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ

**ఢిల్లీ :** జమ్మూ కాశ్మీర్ కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించటంపై సుప్రీం కోర్టు స్పందించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఏప్రిల్ నెలలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ప్రస్తావించింది. ఉగ్రదాడిని, దాడి వల్ల ఏర్పడ్డ ప్రాంతీయ భద్రతా సమస్యలను విస్మరించలేమని తేల్చి చెప్పింది. గురువారం జమ్మూకాశ్మీర్ కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న పిటిషన్ పై చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నాయకత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. జమ్మూకాశ్మీర్ కు రాష్ట్ర హోదాపై కీలక వ్యాఖ్యలు చేసింది.'పహల్గామ్ ఉగ్రదాడిని, దాడి కారణంగా జమ్మూకాశ్మీర్‌లో నెలకొన్న ప్రాంతీయ భద్రతా సమస్యల్ని విస్మరించలేము' అని ధర్మాసనం పేర్కొంది. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ దాఖలు అవుతున్న పిటిషన్లను కలిపి ఓ జాబితా చేయాలని విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ్ కోర్టును కోరారు. ఓ బెంచ్ ఏర్పాటు చేసి, ఓ కచ్చితమైన సమయాన్ని నిర్ణయిస్తే బాగుంటుందని అన్నారు. దీనికి చీఫ్ జస్టిస్ సమాధానం ఇస్తూ 'ప్రభుత్వం నుంచి ముందు స్పందన రానివ్వండి' అని అన్నారు.కాగా, 2023 డిసెంబర్ నెలలో సుప్రీంకోర్టు జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై విచారణ జరిపింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ మధ్యలో జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. 42 సీట్లకు గానూ కూటమి ప్రభుత్వం 27 సీట్లు గెలిచింది. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం అవుతున్నా రాష్ట్ర హోదా పునరుద్ధరించకపోవటంపై సుప్రీం కోర్టులో వరుసగా పిటిషన్‌లు దాఖలు అవుతున్నాయి.

# డేంజర్‌లో సింగూర్ డ్యామ్..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సింగూరు డ్యామ్ కు ముప్పు పొంచి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. మొన్న జూరాల ప్రాజెక్టుకు ప్రమాద ఘంటికలు, నిన్న మంజీరా బ్యారేజీకి పొంచి ఉన్న ముప్పు, నేడు సింగూరు డ్యామ్ కు మోగిన డేంజర్ బెల్స్ అని పేర్కొన్నారు. ఇతర ప్రాజెక్టులకు రిపేర్లు వస్తే తప్పులేదనట్టు ఫోజులు కొట్టే కాంగ్రెస్, బీజేపీ నేతలు.. కాళేశ్వరంపై మాత్రం బురద జల్లడం.. వాళ్ల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రాజెక్టులు కట్టాక రిపేర్లు వస్తుంటాయనే విషయాన్ని మభ్యపెట్టి కేవలం మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పిల్లర్లను బూచిగా చూపించి కమిషన్ల పేరిట కక్షగట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. జూరాల ప్రాజెక్టులోని 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడంతో పాటు బలహీనంగా ఉన్న ఇతర గేట్ల రోప్ లను అలాగే గాలికొదిలేస్తే ప్రాజెక్టు నిలుస్తుందా? అని ప్రశ్నించారు.హైదరాబాద్ జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం చేసిన హెచ్చరికపై సోయి లేకపోతే మంజీరాకు మనుగడ ఉంటుందా? అని నిలదీశారు. ఇవాళ సింగూరు డ్యామ్ కు కూడా డేంజర్ బెల్స్ మోగుతున్నాయని అదే ఎన్ డీఎస్ఏ హెచ్చరికను కూడా అలాగే పెడచెవిన పెట్టి ప్రాజెక్టు భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తారా? అని ప్రశ్నించారు. జూరాలకు, మంజీరాకు, సింగూరుకు ఒక న్యాయం.. మేడిగడ్డ బ్యారేజీకి మాత్రం మరో న్యాయం అంటే నాలుగు కోట్ల ప్రజలు ఊరుకోరని తెలిపారు. అన్ని ప్రాజెక్టులకు యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు.

# జమ్మూకాశ్మీర్ లో క్లౌడ్ బరస్ట్..

**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీర్ కిష్త్వార్‌లోని చోసిటి గ్రామంలో గురువారం భారీ మేఘాల విస్ఫోటం(క్లౌడ్‌బరస్ట్) సంభవించిన విషయం తెలిసిందే. దీంతో సంభవించిన ఆకస్మిక వరదలు, పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించాయి. ఇప్పటి వరకు ఇద్దరు CISF జవాన్లు సహా కనీసం 33 మంది మరణించారు. 120 మందికి పైగా గాయపడ్డారు. బాధితులను కాపాడేందుకు కోసం రెస్క్యూ బృందాలు పరుగులు తీస్తున్నాయి. 220 మందికి పైగా ప్రజలు గల్లంతయినట్లు తెలుస్తోంది. హిమాలయలోని మాతా చండి పుణ్యక్షేత్రానికి వెళ్లే మచైల్ మాతా యాత్ర మార్గంలో ఈ విపత్తు సంభవించింది. దీంతో తీర్థయాత్ర మార్గం మొత్తం గందరగోళంగా మారింది. కిష్త్వార్ ప్రాంతంలో పరిస్థితి గురించి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వివరించానని



జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈ ఘటన జరిగిన ప్రాంతం నుంచి సమాచారం నెమ్మదిగా వస్తోందని సహాయక చర్యల కోసం సాధ్యమైన అన్ని వనరులను సమీకరిస్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని మోడీ స్పందించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**ఏమిటీ క్లౌడ్‌బరస్ట్..?**

భారత వాతావరణశాఖ ప్రకారం.. సాధారణంగా అతి స్వల్ప సమయంలో భారీ వర్షాలకు దారితీయడాన్నే మేఘాల విస్ఫోటము లేదా క్లౌడ్‌బరస్ట్‌గా వ్యవహరిస్తారు. ముఖ్యంగా 20 నుంచి 30చ.కి.మీ పరిధిలో గంటకు 10సెం.మీ (100మి.మీ) వర్షపాతం నమోదవుతుంది. ఒక్కోసారి ఉరుములు, పిడుగులతో ఊహించని స్థాయిలో కురిసే ఈ భారీ వర్షాలు ఆకస్మిక వరదలకు దారితీస్తాయి. స్వల్ప పరిధిలో రెండు గంటల వ్యవధిలోనే 5 సెం.మీ, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదైతే కూడా దాన్ని మినీ క్లౌడ్‌బరస్ట్‌గా వ్యవహరిస్తారు. అయితే, అన్ని క్లౌడ్‌బరస్ట్‌లు భారీ వర్షాలకు దారి తీస్తాయి.. కానీ, స్వల్ప సమయంలో సంభవించే భారీ వర్షాలన్నింటినీ క్లౌడ్ బరస్ట్‌గా పరిగణించలేం. కొన్ని వాతావరణ పరిస్థితులు ఉంటేనే వాటిని క్లౌడ్ బరస్ట్‌గా పరిగణిస్తారు.

# భారీగా చొరబడ్డ బంగ్లాదేశ్ వాసులు..

- హైదరాబాద్‌లోకి భారీగా చొరబడ్డ బంగ్లాదేశ్ వాసులు
- 20 మంది వలస దారులను పట్టుకున్న పోలీసులు
- బీఎస్ఎఫ్‌కు అప్పగించిన తెలంగాణ పోలీసులు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోకి బంగ్లాదేశ్ వాసులు భారీగా చొరబడ్డారు. హైదరాబాద్, సైబరాబాద్ శివారు ప్రాంతాల్లో అక్రమ వలసదారులు భారీ సంఖ్యలో నివసిస్తున్నారు. హైదరాబాద్ లోకి అక్రమంగా వచ్చిన వారిని పోలీసులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే 20 మంది అక్రమ బంగ్లాదేశ్ వలస దారులను పోలీసులు పట్టుకున్నారు. 20 మంది బంగ్లాదేశ్ వాసులను పట్టుకొని.. భారత సరిహద్దు ప్రాంతంలో ఉన్న బీఎస్ ఎఫ్ కు తెలంగాణ పోలీసులు అప్పగించారు.హైదరాబాద్ నగరంలో ఇదివరకే పలుమార్లు బంగ్లాదేశీయులను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎప్పటికప్పుడు అక్రమ వలసదారులను బీఎస్ ఎఫ్ కు అప్పగిస్తున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు దేశవ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. గతేడాది బంగ్లాదేశ్ లో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో భారతదేశంకు అక్రమ వలసలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలోకి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకుంటున్నారు.

# కన్నెర్ర చేసిన ర్యాగింగ్ భూతం


## కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు!

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థుల్లో విచ్చలవిడితనం పెరుగుతోంది. కొంత మంది విద్యార్థులు.. స్కూలు నుంచి కాలేజీలోకి రాగానే రౌడీ ప్రవర్తన అలవాటు చేసుకుంటున్నారు. కాలేజీల్లోనే గ్యాంగులు మెయింటెన్ చేస్తూ దాడులకు దిగుతున్నారు. మరోవైపు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కాలేజీల నుంచి ర్యాగింగ్ భూతం వెళ్లిపోవడం లేదు.ఈ ఘటన హైదరాబాద్ ఎల్బీనగర్ లో జరిగింది. కొట్టుకుంటున్న వాళ్లంతా అవినాష్ కాలేజీ విద్యార్థులు. ఒకే కాలేజీలో రెండు గ్యాంగులుగా విడిపోయిన విద్యార్థులు ప్రతి చిన్న విషయానికి అవతలి గ్యాంగ్ పై దాడులు చేయడం.. అవతలి గ్యాంగ్ స్టూడెంట్స్.. ఇటు ఉన్న వారిపై ప్రతి దాడి చేయడం నిత్యకృత్యం అయిపోయింది. దీంతో రోజూ గొడవలతో ఆ కాలేజీ క్యాంపస్ దద్దరిల్లుతోంది.వాళ్లల్లో వాళ్లు కొట్టుకుంటూనే ఎల్బీ నగర్ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ప్రతి రోజూ దాడులు- ప్రతి దాడులు జరుగుతుండడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అవినాష్ కాలేజీ విద్యార్థుల న్యూసెన్స్ పై పోలీసులకు ఫిర్యాదు చేశారు స్థానికులు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మొత్తంగా 15 మందిపై కేసులు నమోదు చేశారు. అసలు గొడవలకు కారణాలేంటని కనుగొనే పనిలో పడ్డారు.మరోవైపు కాలేజీల్లో ఇంకా ర్యాగింగ్ భూతం వెంటాడుతూనే ఉంది. జూనియర్ స్టూడెంట్లు దీని నుంచి తప్పించుకోవడానికి వీల్లేకుండా తయారైంది. ర్యాగింగ్ పేరుతో సీనియర్ స్టూడెంట్లు చేస్తున్న అరాచకాలు శ్రుతి మించుతున్నాయి.పల్నాడు జిల్లా గురజాల నియోజవర్గం దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన ఘటన. ఇక్కడ ర్యాగింగ్ పేరుతో జూనియర్లకు చుక్కలు చూపిస్తున్నారు సీనియర్లు. ఇంటర్మీడియెట్ బైపీసీకి చెందిన ఓ విద్యార్థిని విపరీతంగా కొట్టారు. బీసీ హాస్టల్లోకి తీసుకు వెళ్లి కరెంట్ పెట్టి చంపుతామని బెదిరించారు. ర్యాగింగ్ పేరుతో జూనియర్ విద్యార్థిని నానా బూతులు తిట్టారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ హాస్టల్ అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకోవడానికి పిల్లలను పంపిస్తే.. వారి ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ ఘటనపై దాచేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు పేరెంట్స్. దీంతో ఈ కేసులో ఇద్దరు సీనియర్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు పోలీసులు.

# డిగ్రీ లేని పోలీసులకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ గుడ్ న్యూస్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** డిగ్రీ పూర్తి చేయని కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఏఆర్ఎస్ఐకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ గుడ్ న్యూస్ చెప్పింది. వీరంతా దూరవిద్య విధానంలో డిగ్రీ పూర్తి చేసేలా బీఆర్ఏవోయూ, తెలంగాణ పోలీసు శాఖ మధ్య ఇవాళ ఎంవోయూ కుదిరింది. ఈ మేరకు డీజీపీ జితేందర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొ.ఘంటా చక్రపాణి సమక్షంలో ఎంవోయూ పత్రాలను అధికారులు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఘంటా చక్రపాణి.. ఇవాళ జరిగిన ఎంవోయూ చారిత్రాత్మకమైనదని అన్నారు. అనేక అంశాల్లో తెలంగాణ పోలీసు వ్యవస్థ అగ్రగామిగా ఉందని, నేరాల అదుపులో, రికవరీలో, శాంతిభద్రతలు కాపాడే విషయంలో మన పోలీసులకు మంచి పేరుందన్నారు. ఇటువంటి పోలీస్ శాఖలోని సిబ్బంది 100 శాతం గ్రాడ్యుయేషన్ సాధిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఈ ముందడుగు పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర పోలీస్ శాఖలో 30-35 వేల మంది సిబ్బంది ఇంటర్మీడియేట్ లేదా ఆ కింది స్థాయిలోనే చదువులు ఆపేసి ఉద్యోగానికి వచ్చిన వారు ఉన్నారని చెప్పారు. ఇటీవల ఓ సందర్భంలో డీజీపీని కలిసినప్పుడు ఈ విషయం చర్చకు రావడంతో వెంటనే జితేందర్ స్పందించి దీన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సహకరించారని తెలిపారు. 10+2 పూర్తి చేసిన ప్రతి ఒక్క పోలీసు డిగ్రీ పూర్తి చేసిన పోలీసు అయి ఉండాలనే తమ ఆలోచనకు డీజీపీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.అంబేద్కర్ యూనివర్సిటీలో సాధారణంగా ఎవరైనా విద్యార్థి ఆరేళ్లలో డిగ్రీ పూర్తి చేయవచ్చని, అయితే ఇప్పుడు చేరే పోలీసులు రాబోయే ఐదేళ్లలో తమ డిగ్రీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఘంటా చక్రపాణి చెప్పారు. బెటర్ పోలీసింగ్ కోసం అదనంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. అదనపు సమాచారంతో కూడిన సబ్జెక్టులు అందజేస్తామన్నారు. ఉత్తమ పోలీసింగ్ కు అవసరమైన మెటీరియల్ ను ఆన్ లైన్ లోనూ అందిస్తామన్నారు. పోలీసులు తమ విధులను నిర్వహించుకుంటూనే డిగ్రీ పూర్తి చేయాల్సి ఉన్న నేపథ్యంలో వారి డ్యూటీలను సర్దుబాటు చేసుకునేలా పోలీస్ ట్రైనింగ్ సెంటర్లను స్టడీ సెంటర్లుగా కన్వర్ట్ చేయనున్నట్లు వెల్లడించారు.



**79 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలతో...**

**దేశ భక్తి గేయం..**

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
పిల్లల్లారా పాపల్లారా..!రేపటి భారత
పౌరుల్లారా..!!భారత దేశం ఒకటే ఇల్లు
భారత మాతకు మీరే కళ్ళు జాతి
పతాకము పైకెగరేసి జాతి గౌరవము
కాపాడండి బడిలో బయట అంత కలసి
భారతీయులై మెలగాలి కన్యాకుమా
రానికి కాశ్మీరానికి అన్యోన్యతను
పెంచండి వీడని బంధం వేయండి.!!
-- చిట్యాల రక్ష 5 వ తరగతి
యుపీఎస్- గాంధీ పార్క్
మిర్యాలగూడ.

# నారాయణ క్యాంపస్ లో

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**రంగారెడ్డి సరూర్నగర్, ఆర్కే పురం ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** విద్యార్థిని విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి నృత్య ప్రదర్శనలు చేసి అందరిని అలరించారు. వీరి వేషధారణతోటి పాఠశాల ఆవరణమంతా బృందావనాన్ని తలపించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి యం. గోపాల్ రెడ్డి గారు, ఏజీ యం. హేమాంబర్ గారు, ఆర్ ఐ. రవి ప్రసాద్ గారు, ఆర్& డి. శివరంజని గారు, గాయత్రి గారు, శిరీష్ గారు, ప్రిన్సిపల్ సమీనా గారు, ఏ. ఓ రమేష్ గారు, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత, కీర్తి గార్లు ఏ.డి స్వామి గారు పాల్గొన్నారు


# నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు

- నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు
- బాలికపై అత్యాచారం చేసిన నిందుతుడికి ఉరిశిక్ష
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు




**నల్గొండ,ఫ్లాష్ ఇండియా :** నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందుతుడికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. పోక్సో, హత్య కేసులో నిందుతుడికి ఉరిశిక్ష విధించింది. అంతేకాదు జరిమానాగా లక్షా పది వేల రూపాయలు కట్టాలని ఆదేశించింది. నిందుతుడికి ఉరిశిక్ష విధించిన నల్గొండ కోర్టుపై బాధిత కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కూతురికి ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.2013లో మొహమీ ముక్రమ్ అనే వ్యక్తి మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. ఇంట్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేసిన అనంతరం హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశాడు. మూడు రోజుల తర్వాత పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడిపై నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. 2015లో ఛార్జ్ షీట్ దాఖలు అయింది. పోక్సో, హత్య నేరం కేసులో తాజాగా నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది.

# నిండుకుండలా పులిచింతల ప్రాజెక్టు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసి నాగార్జునసాగర్ కు భారీగా వరద నీరు చేరుతుంది. దీంతో అధికారులు 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పాటు హైదరాబాదులో భారీ వర్షాల వలన మూసి నీరు పులిచింతల ప్రాజెక్టుకు భారీగా చేరుతుంది. దీంతో అధికారులు 9 రేడియల్ గేట్లు 4 మీటర్ల మేర, 1 రేడియల్ గేటు 3 మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 37.05 టీఎంసీలకు చేరింది. పూర్తి నీటి మట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 169.06 అడుగులకు చేరింది. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 3,32,664 క్యూసెక్కులు నమోదు కాగా, అవుట్ ఫ్లో 3,22,163 క్యూసెక్కులుగా నమోదయింది. లీకేజీల ద్వారా 400 క్యూసెక్కులు, ప్రాజెక్టు ఎడమవైపున ఉన్న తెలంగాణ జెన్ కో ద్వారా ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం 16,600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

# బల్దియా అధికారులపై జనం ఫైర్!

## బేగంబజార్‌లో కుప్పకూలిన బిల్డింగ్..

- తెలంగాణలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- బేగంబజార్‌లో కుప్పకూలిన బిల్డింగ్

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జోరు వానలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలకు నగరంలోని బేగంబజార్ లో ఓ పురాతన బిల్డింగ్ కుప్పకూలింది. ఘటన సమయంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.భవనం శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే కూల్చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు గతంలోనే యజమానికి నోటీసులు ఇచ్చారు. అయితే జీహెచ్ఎంసీ హెచ్చరికలను భవన యజమాని పట్టించుకోలేదు. బిల్డింగ్ కూలిపోగా.. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో సరిపోయింది. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంబజార్ లో ఇలాంటి పురాతన బిల్డింగ్స్ లోనే వ్యాపారులు షాప్స్ కొనసాగిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో కూలిపోయే స్థితిలో ఉన్న భవనాలను కూల్చేయాలని పబ్లిక్ డిమాండ్ చేస్తున్నారు. బల్దియా అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి సరిపెడుతున్నారని జనాలు ఫైర్ అవుతున్నారు.

# వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంపు..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఆదాయం సమకూర్చుకోవడంలో కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉందని భట్టి చెప్పిన మాటలను రేవంత్ రెడ్డి ఈ రకంగా నిజం చేసి చూపిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. జీవో 53, 54 లతో కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంచి ప్రజలపై భారం వేశారని.. పన్నుల భారంతో పేదల రక్తం పీల్చే ఎత్తుగడ వేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రజలను దొంగ దెబ్బ కొట్టారని పేర్కొన్నారు. ఇప్పటికే ఏ ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలంటే లక్ష దాటిందని.. రైతులు, చిరు వ్యాపారులు ద్విచక్ర వాహనాలను వృత్తి, ఉపాధి పరంగా కొనుగోలు చేస్తుంటారని.. లక్ష దాటిన వాహనాలపై లైఫ్ టాక్స్ ను 12 శాతం నుంచి 15శాతానికి పెంచడం దుర్మార్గమని పేర్కొన్నారు. బైక్ ఎక్స్ షోరూం ధర లక్షా 10వేలు ఉంటే, ఇప్పటివరకు 13,200 లైఫ్ టాక్స్ కట్టాల్సి ఉండేదని.. తాజా పెంపుతో రూ.16,500లకు పెరుగుతుందని తెలిపారు.ఇంత పెద్ద మొత్తంలో అదనపు భారాన్ని పేద, మధ్య తరగతి ప్రజలపై కాంగ్రెస్ వేస్తున్నదని పేర్కొన్నారు. కారు కొనుక్కోవాలనే వారి ఆశలపైనా కాంగ్రెస్ నీళ్లు చల్లిందని తెలిపారు. 10-20 లక్షలతో కారు కొంటే 17శాతంగా ఉన్న పన్ను శాతాన్ని 18శాతానికి పెంచారని పేర్కొన్నారు. దాదాపు 20 వేల అధిక భారం కొనుగోలుదారులపై కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్నదని తెలిపారు. కమర్షియల్ వెహికిల్స్ పై పన్ను పెంచడం వల్ల, చివరకు అది మార్కెట్ పై, ప్రజలపైనే భారం పడుతుందని పేర్కొన్నారు. హ్యామ్ మోడల్ కోసం రుణాలు సేకరించేందుకు టాక్స్ పెంచడం శోచనీయమని తెలిపారు. బ్యాంకుల వద్ద అణాపైసా అప్పు పుట్టట్లేదని ఆదాయం కోసం పన్నులు విధించటమే మార్గంగా రేవంత్ భావిస్తున్నారని ఆరోపించారు.

# రెండు సంవత్సరాలైనా పూర్తికాని ముషంపల్లి రోడ్డు



**నల్లగొండఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ప్రజలు నడవలేని స్థితిలో ఉన్న రోడ్డుపై వరి నాట్లు వేసిన సిపిఎం నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి గారి నిర్లక్ష్యం వల్లనే రోడ్లు పూర్తి కావడం లేదని ఆరోపించిన సిపిఎం నాయకులునల్లగొండ జిల్లా ముషంపల్లి రోడ్డు నిర్మాణం రెండు సంవత్సరాలు గడిచినా పూర్తి కాకపోవడంపై సిపిఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు సిపిఎం ఆధ్వర్యంలో, బురద మయంగా మారి ప్రజలు నడవలేని రోడ్డుపై వరి నాట్లు వేసి వినూత్న నిరసన తెలిపారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ-రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు, రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ–ముషంపల్లి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టారని, ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, రెండు సంవత్సరాలు గడిచినా నల్లగొండ నుండి ముచంపల్లి రోడ్డు మరియు నల్లగొండ నుండి నర్సింగ్ బట్ల రోడ్డు పనులు పూర్తి కాలేదని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.ప్రభుత్వం "డబ్బు లేదని" సాకుతో రోడ్డు పనులు ఆపివేయడం అన్యాయమని, వెంటనే కాంట్రాక్టర్లను, అధికారులను సమీక్షించి పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాత్కాలికంగా అయినా బురద గుంటలను మట్టితో పూడ్చి ప్రజలు నడవడానికి అనువుగా రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో, సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండా అనురాధ, సిపిఎం నల్లగొండ మండల కార్యదర్శి నలుపురా సైదులు, మండల కమిటీ సభ్యులు జిల్లా అంజయ్య, కొండ వెంకన్న, భత్తుల బక్కయ్య, కందే యాదగిరి, విజయ్ రెడ్డి, మారెపల్లి శివ, భూతరాజు మహేష్, నల్లగొండ వెంకన్న, భూతం రమేష్, గోగు సైదులు, మురళి, గుండెబోయిన వెంకన్న, అంజమ్మ, సులోచన, ఇరుగు మారమ్మ తదితరులు పాల్గొన్నరు.

# రాఖీ కట్టించుకోవడానికి పోయి.. గన్స్‌తో ఎంట్రీ




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రక్షా బంధన్ రోజు సొంత గ్రామానికి వెళ్లిన కూలీ గన్స్ తో హైదరాబాద్ కు వచ్చి రాచకొండ ఎస్ఓటీ పోలీసులకు దొరికిపోయాడు. కూలీ నుంచి గన్స్ విక్రయించే దందాకు శ్రీకారం చుట్టిన అతని నుంచి పోలీసులు మూడు గన్స్ , 10 బుల్లెట్ లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, ఎస్ఓటీ డీసీపీ రమణరెడ్డి, అదనపు డీసీపీ నంద్యాల నర్సింహా రెడ్డితో కలిసి వెల్లడించిన వివరాల ప్రకారం... బీహార్ కు చెందిన శివకుమార్ హైదరాబాద్ చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి ప్రభుత్వ స్కూల్ వద్ద అద్దెకు కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. మేడిపల్లి లోని శ్రీకర ఫెర్టిలైజర్స్ కంపెనీలో కూలీగా(హమాలీ) పని చేస్తున్నాడు.ఆగస్టు 6వ తేదీన శివకుమార్ రాఖీ పండుగ కోసం బీహార్ కు వెళ్ళాడు. కూలీతో వస్తున్న ఆదాయంతో ఆర్థిక కష్టాలు పెరుగుతుండడంతో తన బావ క్రిష్ణ పాశ్వాన్ తో కలిసి హైదరాబాద్ లో గన్స్ ను అసాంఘిక శక్తులకు విక్రయించేందుకు ప్లాన్ చేసుకున్నాడు. తన బావ దగ్గర నుంచి 3 తుపాకులు, 10 బుల్లెట్ లను తీసుకుని ఇటీవల హైదరాబాద్ కు వచ్చాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో వాటిని విక్రయించేందుకు చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా రాచకొండ ఎస్ఓటీ, చర్లపల్లి పోలీసులు కలిసి శివకుమార్ ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 3 గన్స్ , 10 బుల్లెట్లు దొరికాయి.అతనిని అరెస్టు చేశారు. విచారణలో శివకుమార్ 2022 లో హైదరాబాద్ కు వలస వచ్చి చర్లపల్లిలో ఉంటున్నట్లు తెలిసింది. గతంలో శివకుమార్ గంజాయి చాక్లెట్ లను విక్రయిస్తూ పోలీసులకు దొరికి జైలుకు వెళ్లినట్లు విచారణలో బయట పడింది. శివకుమార్ బావ క్రిష్ణ పాశ్వాన్ ను అరెస్టు చేసేందుకు టీమ్స్ రంగంలోకి దిగాయని సీపీ వెల్లడించారు. శివకుమార్ ఫోన్ ను కూడా పోలీసులు విశ్లేషించి అతనిని ఎవరైనా తుపాకులను కొనుగోలు చేసేందుకు సంప్రదించారానే కోణంలో దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ గన్స్ ను స్వాధీనం చేసుకున్న పోలీసు టీంను సీపీ అభినందించారు.

# క్రీడల ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం పెరుగుతుంది



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మస్థైర్యం,విజయాన్ని స్వీకరించడం,ఓటమిని అంగీకరించడం అనే నైతిక విలువలతో పాటు,బృందంతో కలిసి ఎలా మెలగాలి అనే విషయం,సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మల్గిరెడ్డి భీమార్జున రెడ్డి పేర్కొన్నారు. కళాశాల స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటలపోటీల సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత శారీరక శ్రమను కలిగించే ఆటలను దూరం పెడుతూ ఆన్ లైన్ ఆటలకు బానిసలై పోయి, తమ జీవితాలను,కుటుంబ సభ్యుల జీవితాలను నాశనం చేస్తున్నారని,విద్యార్థులు అటువంటి బెట్టింగ్ ఆటలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు శారీరక మానసిక ఉల్లాస కారకాలని తెలిపారు.విద్యార్థులకు కబడ్డీ,వాలీబాల్,చెస్,క్యారంబోర్డ్ మొదలైన ఆటల పోటేలు నిర్వహించారు.ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతి ప్రదానం ఉంటుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ పి.డి. రవీందర్,అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రికెట్ ప్రపంచంలో నయా సంచలనం




పాకిస్థాన్ తో జరిగిన మూడో వన్డేలో వెస్టిండీస్ ఘన విజయం సాధించింది. బ్యాటింగ్ లో షాయ్ హోప్ , బౌలింగ్ లో జేడెన్ సీల్స్ రాణించడంతో 202 రన్స్ భారీ తేడాతో పాకిస్తాన్ ను చిత్తు చేసింది కరేబియన్ జట్టు. ముఖ్యంగా జేడెన్ సీల్స్ సీల్స్ 6 వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించాడు. జేడెన్ సీల్స్ నిప్పులు చెరిగే బంతులకు బెంబెలెత్తి పోయారు పాక్ బ్యాటర్లు. జేడెన్ సీల్స్ చెలరేగడంతో మూడు వన్డేల సిరీస్ ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది కరేబియన్ టీమ్. తద్వారా 1991 తర్వాత పాక్ పై వన్డే సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ సిరీస్ ఆసాంతం అద్భుతంగా రాణించిన జేడెన్ సీల్స్ (10 వికెట్లు) మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా ఎంపికయ్యాడు. దీంతో ప్రపంచ క్రికెట్లో జేడెన్ సీల్స్ పేరు ఒక్కసారిగా మోరుమోగిపోతుంది. దీంతో క్రికెట్ ప్రియులు ఎవరీ పేస్ గుర్రం అని అతడి గురించి వెతకడం ప్రారంభించారు. 23 ఏళ్ల ట్రినిడాడియన్ బౌలర్ జేడెన్ సీల్స్ 2021లో అంతర్జాతీయ క్రికెట్లోకి ఎంట్రీ ఇచ్చాడు. అరంగ్రేటం చేసి దాదాపు నాలుగేండ్లు అవుతోన్న జేడన్ సీల్స్ మాత్రం ఈ ఏడాదే వెలుగులోకి వచ్చాడు. ఈ ఏడాది ఫార్మాట్ తో సంబంధం లేకుండా చెలరేగి పోయాడు. టీ20, వన్డే, టెస్ట్ ఏదైనా సరే.. ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపిస్తూ వికెట్లు తీయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ విండీస్ నయా ఫాస్ట్ బౌలింగ్ సంచలనం 2025లో ఇప్పటి వరకు 8 వన్డేల్లో 18 వికెట్లు.. 21 టెస్ట్ ల్లో 88 వికెట్లు తీశాడు. బంగ్లాదేశ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ లో టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు ఈ పేస్ గుర్రం. ఒక మ్యాచులో 15.5 ఓవర్లలో 10 మెయిడిన్లు వేసి కేవలం5 రన్స్ మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి బ్యాటర్లకు పీడకలాగా మారాడు. ఈ అసాధారణ రికార్డ్ గురించి చర్చ ముగియకముందే.. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్ లోనూ ఇదే సంచలన ప్రదర్శన రిపీట్ చేశాడు. ప్రపంచంలోనే అత్యంత బలమైన బ్యాటింగ్ లైనప్ గల ఆసీస్ పై 3 మ్యాచ్ ల్లో 13 వికెట్లు తీసి క్రికెట్ ప్రియులను ఔరా అనిపించాడు. ఇదిలా ఉండగానే తాజాగా పాకిస్థాన్ తో జరిగిన వన్డే సిరీస్ లోనూ జేడెన్ సీల్స్ బ్యాటర్లను గడగడలాడించాడు. మూడు మ్యాచుల వన్డే సిరీస్ లో 10 వికెట్లు తీసి సిరీస్ లీడింగ్ వికెట్ టేకార్ గా మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. ముఖ్యంగా పాకిస్థాన్ తో జరిగిన మూడో వన్డేలో జేడన్ సీల్స్ బౌలింగ్ వేరే లెవల్. సీల్స్ చేతి నుంచి మిస్సైల్ లా దూసుకొచ్చే బంతులకు పాక్ బ్యాటర్లు వద్ద సమాధానమే లేకుండా పోయింది. బంతి టచ్ చేయాలంటేనే వణికిపోయారు పాక్ బ్యాటర్లు. ఈ మ్యాచులో 7.2 ఓవర్లు వేసిన సీల్స్ కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 6 వికెట్లు తీసి పాకిస్తాన్ ను కుప్పకూల్చాడు. 295 పరుగుల చేధనలో సీల్స్ దెబ్బకు 92 పరుగులకే చాపచుట్టేసింది పాక్. ఈ నేపథ్యంలో త్వరలోనే భారత్ లో పర్యటించనుంది విండీస్ జట్టు. దీంతో టీమిండియా ఫోకస్ అంతా జేడన్ సీల్స్ పై పడింది. బ్యాటర్ల పాలిట సింహాస్వప్నంలా మారిన విండీస్ నయా సంచలనంతో టీమిండియాకు సవాల్ తప్పదు. దీంతో అగ్రశేణి జట్లను గడగడలా డిస్తున్న సీల్స్.. భారత్ కు కొరకరాని కొయ్యగా మారుతాడా..? లేక వరల్డ్ క్లాస్ టీమిండియా బ్యాటర్ల ముందు తేలిపోతాడా అనేది చూడాలి. ఇదే కాకుండా ప్రపంచ క్రికెట్లో సంచలనంగా మారిన జేడన్ సీల్స్.. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఐపీఎల్ 2026 మినీ వేలంలో కూడా కోట్లు పలికే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆక్షన్లో సీల్స్ హాట్ కేకులా అమ్ముడుపోవచ్చని.. అతడి కోసం ప్రాంచైజ్ లు పోటీ పడాచ్చంటున్నారు.

# రిషబ్ పంత్ కీలక నిర్ణయం..



ఇటీవల ఇంగ్లండ్ తో ముగిసిన ఐదు టెస్టుల సిరీస్ లో టీమిండియా స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయపడిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ లోనే చికిత్స తీసుకున్న పంత్.. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. గాయం కారణంగా త్వరలో జరిగే ఆసియా కప్ 2025కి దూరం కానున్నాడు. ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్న పంత్ ఎంజాయ్ చేస్తున్నాడు. చెఫ్ అవతారం ఎత్తి పిజ్జా తయారు చేశాడు. అయితే అతడు తీసుకున్న ఒక నిర్ణయం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఫాన్స్ పంత్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రిషబ్ పంత్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటాడన్న విషయం తెలిసిందే. ఇన్ స్టాగ్రామ్ లో ఫొటోస్, వీడియోస్ పోస్ట్ చేస్తూ నిత్యం అభిమానులకు టచ్ లోనే ఉంటాడు. అప్పుడపుడు లైవ్స్ కూడా నిర్వహిస్తుంటారు. అయితే పంత్ తాజాగా ఓ కీలక నిర్ణయం తీసుకున్నాడు. తాను పోస్టు చేసే ఎక్స్ క్లూజివ్ వీడియోలు చూసేందుకు లేదా ప్రశ్నలు అడిగేందుకు సబ్ స్క్రిప్షన్ మోడల్ ను తీసుకొచ్చాడు. ఇందుకోసం నెలకు రూ.390 చెల్లించాల్సి ఉంటుంది. దాంతో అభిమానుల నుంచే పంత్ పై వ్యతిరేకత వస్తోంది. ‘కోట్లకు కోట్లు సంపాదిస్తున్నావ్ కదా.. ఈ కక్కుర్తి ఏంటి’ అంటూ ఫైర్ అవుతున్నారు. ఇక పంత్ ను ఇన్ స్టాగ్రామ్ లో అన్ ఫాలో చేయాల్సిందే అంటూ నెటిజెన్స్ కామెంట్ చేస్తున్నారు.రిషబ్ పంత్ ప్రస్తుతం చాలా విధాలుగా డబ్బులు సంపాదిస్తున్నారు. క్రికెట్ కెరీర్, బ్రాండ్ ఎండార్స్ మెంట్ లు, వ్యాపారం, పెట్టుబడులతో బాగానే డబ్బు సంపాదిస్తున్నాడు. ఓ నివేదిక ప్రకారం 2025 నాటికి పంత్ నికర విలువ దాదాపు రూ.100 కోట్లు (12.2 మిలియన్ డాలర్లు). ఐపీఎల్ 2025 వేలంలో లక్నో ప్రాంచైజీ పంత్ ను రూ.27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అంత డబ్బు ఉంది కూడా ఇన్ స్టాగ్రామ్ లో వేల కోసం ఈ కక్కుర్తి ఏంటి అంటూ ఫాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సంజు శాంసన్.. వర్కౌట్ కాదు!



ఐపీఎల్ 2026 కోసం మరికొద్ది రోజుల్లో ఆటగాళ్ల ట్రేడింగ్ ప్రక్రియ ఆరంభం కానుంది. ప్రస్తుతం సంజు శాంసన్, రవిచంద్రన్ అశ్విన్ ల గురించే సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్ కే)ను అశ్విన్ , రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)ను శాంసన్ వదిలేసేందుకు సిద్ధమయ్యాడని ప్రచారం జరుగుతోంది. ఇటీవల వీరిద్దరూ కలిసి ‘కుట్టి స్టోరీస్ ’ పాడ్ కాస్ట్ లో పాల్గొన్నారు. ఆ సమయంలో ఐపీఎల్ గురించి ఎలాంటి చర్చ జరగలేదు. తాజాగా సంజు శాంసన్ ట్రేడింగ్ పై అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సీఎస్ కేకు శాంసన్ వర్కౌట్ అయ్యే అవకాశాలు చాలా తక్కువని పేర్కొన్నాడు.ఆర్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ లో మాట్లాడుతూ...

‘సీఎస్ కే, ఆర్ఆర్ ట్రేడ్ వర్కౌట్ కాదు. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఒకవేళ సీఎస్ కేకి సంజు శాంసన్ ను ట్రేడింగ్ చేసి.. ఆర్ఆర్ ఇతర జట్లతోనూ ట్రేడ్ చేయడానికి ప్రయత్నిస్తే తమకు కావాల్సిన ప్లేయర్స్ దక్కడం కష్టం. రాజస్తాన్ కు రవి బిష్ణోయ్ లాంటి మంచి స్పిన్నర్ అవసరం. అందుకు లక్నోను అప్రోచ్ కావాలి. లక్నో ప్రాంచైజీ సంజును తీసుకొని బిష్ణోయ్ ను ఇస్తే ఎల్ ఎస్ జీ పర్స్ పై భారీగా ఎఫెక్ట్ పడుతుంది. సీఎస్ కే ఇలాంటి ట్రేడింగ్ పై పెద్దగా ఆసక్తి చూపదు. రవీంద్ర జడేజా, శివమ్ దూబెను సీఎస్ కే అస్సలు వదులుకోదు. ట్రేడింగ్ వలన రాజస్తాన్ కు ప్రయోజనం ఉండకపోవచ్చు’ అని చెప్పాడు.రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ 2025 మెగా వేలంలో శాంసన్ ను రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. మరోవైపు రవీంద్ర జడేజాను రూ.18 కోట్లకు, శివమ్ దూబెకు రూ.12 కోట్లు చెన్నై అట్టిపెట్టుకుంది. కీలక ప్లేయర్స్ అయిన జడేజా, దూబెలను సీఎస్ కే వదులుకోవడం అసాధ్యమే. ఒకవేళ వదులుకున్నా.. ఈ ఇద్దరి కోసం ఆర్ ఆర్ ఏకంగా 30 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. ఐపీఎల్ 2026 కోసం మినీ వేలం జరగనుంది. ఎప్పటిలానే నవంబర్ లేదా డిసెంబర్ మాసాల్లో వేలం జరిగే అవకాశాలు ఉన్నాయి.

# ఒకే ఒక్క మ్యాచ్ తో 81 స్థానాలు



సౌత్ ఆఫ్రికా డేంజర్ ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బేబీ AB గా పిలువబడే డెవాల్డ్ బ్రెవిస్... ఆస్ట్రేలియాపై ఇరగదీస్తున్నాడు. తాజాగా సెంచరీ కూడా నమోదు చేసుకున్నాడు ఈ డేంజర్ ప్లేయర్. ఆస్ట్రేలియా వర్సెస్ సౌత్ ఆఫ్రికా మధ్య తాజాగా టీ20 మ్యాచ్ జరిగింది. ఈ రెండు టి20 మ్యాచ్ లో ఏకంగా 125 పరుగులు చేసి రఫ్ ఆడించాడు డెవాల్డ్ బ్రెవిస్.ఈ సెంచరీ తో దక్షిణాఫ్రికా తరపున అత్యధిక టి20 వ్యక్తిగత పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. అదే సమయంలో దక్షిణాఫ్రికా జట్టు తరపున సెంచరీ కొట్టిన చిన్న వయసు ఉన్న ప్లేయర్ గా డెవాల్డ్ బ్రెవిస్ సరికొత్త రికార్డులు సృష్టించాడు. అయితే ఈ ఒక్క సెంచరీ తో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో... ఏకంగా 81 స్థానాలు ఎగబాగాడు.ఈ సెంచరీ కంటే ముందు 102 వ స్థానంలో డెవాల్డ్ బ్రెవిస్.. ఉన్నాడు. సెంచరీ చేసిన తర్వాత అతని ప్రస్తుత ర్యాంకు 21గా ఉంది. అంటే 80 కి పైగా స్థానాలు ఎగబాకి 21 స్థానానికి చేరుకున్నాడు. ఇలా ఒకేసారి ర్యాంకింగ్ లో దూసుకు వెళ్లడం మొదటి సారి అని అంటున్నారు. ఇక ఇదే టి20 ర్యాంకింగ్స్ లో టీమిండియా డేంజర్ ఆటగాడు అభిషేక్ శర్మ మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు రెండో స్థానంలో తిలక్ వర్మ ఉన్నాడు.

# భారత షట్లర్లకు కఠిన డ్రా



బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్ షిప్ప్ లో భారత షట్లర్లకు కఠిన సవాళ్లు ఎదురు కానున్నాయి. ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే మెగా టోర్నీ డ్రాను బుధవారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్ లో లక్ష్య సేన్ కు తొలి రౌండ్ లోనే వరల్డ్ నెం:1 షి యు కి (చైనా) రూపంలో గండం ఎదురుకానుంది. పారిస్ ఒలింపిక్స్ సెమీ స్ లో ఓటమి తర్వాత లక్ష్య సేన్ మళ్లీ పుంజుకోలేకపోయాడు. 2021 ప్రపంచ చాంపియన్ షిప్స్ లో సేన్ కాంస్యం సాధించాడు. మరో భారత షట్లర్ హెచ్ ఎ్ స ప్రణయ్ కూడా ఫామ్ లో లేడు. తొలి రౌండ్ గట్టెక్కినా.. రెండో రౌండ్ లో వరల్డ్ నెం:2 ఆండ్రెస్ అంటాన్ సెన్ రూపంలో ముప్పు పొంచి ఉంది. కాగా, 2019 చాంపియన్ పీవీ సింధు మాత్రమే మహిళల సింగిల్స్ లో భారత్ కు ప్రాతినిధ్యం వహిస్తోంది. తొలి రౌండ్ లో కలోయనా నల్ బంటోవా (బల్గేరియా)తో సింధు తలపడనుంది. ఫామ్ కోసం తంటాలు పడుతున్న సింధు.. ప్రీక్వార్టర్స్ లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)ను ఢీకొనాల్సి రావచ్చు. ఈ టోర్నీలో సింధు స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు సాధించింది. ఈ ఏడాది ఇండియా ఓపెన్ క్వార్టర్స్ చేరడమే సింధు అత్యుత్తమ ప్రదర్శన. కాగా, పురుషుల డబుల్స్ లో సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్ షెట్టి జంటకు తొలి రౌండ్ బై లభించింది. మహిళల డబుల్స్ లో ట్రీసా జాలీ-గాయత్రి జోడీ టోర్నీ నుంచి తప్పుకోగా.. రితుపర్ణ-శ్వేతపర్ణ, ప్రియ కొన్ జెంగ్ బమ్ -శ్రుతి మిశ్రా జంటలు బరిలో నిలవనున్నాయి. మిక్స్ డ్ లో రుత్విక గద్దె-రోహన్ కపూర్ , ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయాలు ఆడనున్నాయి.


# బిజినెస్

## తక్కువ డబ్బుతో ఇన్వెస్ట్మెంట్ జర్నీ స్టార్ట్

వారెన్ బఫెట్ పెట్టుబడుల ప్రపంచంలో ఒక విజయవంతమైన వ్యక్తి. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన తన 94 ఏళ్ల వయస్సులో కూడా తన సక్సెస్ కొనసాగించటానికి కారణం ఆర్థిక అంశాలపై ఆయనకు ఉన్న పట్టే. 140 బిలియన్ డాలర్ల సంపదకు అధిపతి అయిన బఫెట్ ఇప్పటికీ అవసరమైన మేరకే ఖర్చు చేస్తూ సింపుల్ జీవితాన్ని గడపటంతో పాటు కోట్ల మందికి ఆయన పెట్టుబడి సూత్రాలు మార్గనిర్దేశంగా కొనసాగుతున్నాయి. వారెన్ బఫెట్ పెట్టుబడి సూత్రాలు చాలా తక్కువ డబ్బు పెట్టుబడికి కలిగి ఉన్న వ్యక్తులకు సెట్ అవుతాయా అనే ప్రశ్నకు అవును అని జవాబు వినిపిస్తోంది. ఎందుకంటే బఫెట్ కూడా చిన్న మొత్తం పెట్టుబడితోనే తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఎదుగుదలకు మంచి అవకాశం ఉన్న చిన్న మంచి కంపెనీలను తక్కువ డబ్బుతో కొన్నానని, రిస్క్ ఉన్నట్లే వాటి నుంచి డబ్బు కూడా పొందినట్లు బఫెట్ చెప్పారు. చిన్న మొత్తంతో పెట్టుబడులు స్టార్ట్ చేసినప్పుడు ఎక్కువ పరిశీలించి సరైన ఎంపికలతో ముందుకెళతామని అన్నారు. వారెన్ బఫెట్ దృష్టిలో పెట్టుబడి అనేది కేవలం డబ్బును కలిగి ఉండటం మాత్రమే కాదు జ్ఞానాన్ని కలిగి ఉండటం. అందుకే ఆయన ప్రతి రోజూ పుస్తకం చదవటం అలవాటుగా మార్చుకున్నారు. చిన్న మొత్తంతో పెట్టుబడిని స్టార్ట్ చేయటం మంచిదంటారు. కొత్తగా వచ్చే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడి జర్నీని తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ఇండెక్స్ ఫండ్స్ నుంచి ప్రారంభించటం సురక్షితమని చెబుతుంటారు. దీనికి తోడు ఏదైనా స్టాక్ ఎంచుకునే ముందు ఆ కంపెనీ ఆర్థిక ఫలితాలు, భవిష్యత్తు ప్లాన్స్, బిజినెస్ మోడల్ వంటి అంశాలను ఖచ్చితంగా అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు బఫెట్. చిన్న పెట్టుబడులతో స్టార్ట్ చేసినప్పటికీ ఇన్వెస్టర్లు.. దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహంతోనే నడవాలని ఆయన చెబుతుంటారు. రోజుల్లో గంటల్లో రెట్టింపు లాభాలు కోరుకుంటే చివరికి నష్టాలు మిగిలే ప్రమాదం ఉందని ఆయన నమ్ముతుంటారు. అలాగే తక్కువ బ్రోకరేజ్, టాక్సులు ఉండేలా చూసుకోవాలని చెబుతుంటారు. ఇక స్టాక్స్ ఎంపిక విషయంలో ఫ్యాన్సీ రిటర్న్స్ అంటూ ఊదరకొట్టే వాటికి దూరంగా ఉంటూ మంచి వ్యాల్యుయేషన్ ఉన్న వాటిని ఎంచుకోవాలని పెట్టుబడిదారులకు సూచిస్తుంటారు బఫెట్. కాంపౌండింగ్ ఒక పెద్ద మ్యాజిక్ అని దానికి ఎక్కువ సమయం అవసరమని ఆయన చెబుతుంటారు.



# రికార్డులు బద్దలు కొట్టిన బిట్‌కాయిన్..




గడచిన కొన్ని నెలలుగా క్రిప్టో కరెన్సీలు ఇన్వెస్టర్ల తలరాతను మార్చేస్తున్నాయి. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి బిట్ కాయిన్ భారీ ర్యాలీని చూస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న వాణిజ్య రాజకీయ అనిశ్చితులతో ఇన్వెస్టర్లు సాంప్రదాయ పెట్టుబడి మార్గాలైన బంగారం, వెండి నుంచి క్రిప్టోలకు మారుతుండటంతో పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. ప్రస్తుతం ప్రముఖ క్రిప్టో కరెన్సీ అయిన బిట్ కాయిన్ రాకెట్ వేగంతో తన పాత రికార్డులను బద్దలు కొడుతూ సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకుంది. నేడు బిట్ కాయిన్ రేటు ఏకంగా లక్ష 24వేల డాలర్ల మార్కును అధిగమించి పెట్టుబడిదారులకు కనకవర్షం కురిపిస్తోంది. దీనికి ముందు సరిగ్గా నెలరోజుల కిందట అంటే జూలై 14న బిట్ కాయిన్ లక్ష 23వేల 205 వద్ద రికార్డును సృష్టించిన సంగతి తెలిసిందే. అమెరికా మార్కెట్లతో పాటుగా క్రిప్టోలు కూడా వేగంగా వృద్ధిని సాధించటంతో చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి క్రిప్టోల్లో పెట్టుబడులు పెడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

**బిట్ కాయిన్ ర్యాలీకి కీలక కారణాలు...**

1. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చిన తర్వాత యూఎస్ ప్రభుత్వం క్రిప్టోలకు అనుకూల విధానాలను తీసుకురావటం.
2. కార్పొరేట్ కంపెనీలు కూడా బిట్ కాయిన్ వంటి క్రిప్టోల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపటం.
3. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గుతున్న క్రమంలో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయనే అంచనాలతో గోల్డ్, సిల్వర్ లో పెట్టుబడి పెట్టిన చాలా మంది క్రిప్టోలను ఆశ్రయించటం ర్యాలీకి కారణాలుగా ఉన్నాయి.

ప్రస్తుతం క్రిప్టో పెట్టుబడుల్లో 70 శాతం మార్కెట్ బిట్ కాయిన్, ఈథర్ కలిగి ఉన్నాయి. బిట్ కాయిన్ మార్కెట్ క్యాప్ 2.5 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా.. ఈథర్ విలువ 575 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడైంది.

# సూచీలకు స్వల్ప లాభాలు..





గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ప్రస్తుతం కోలుకుంటున్నాయి. బుధవారం భారీ లాభాలను ఆర్జించిన సూచీలు గురువారం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ మాత్రం నష్టాలతోనే రోజును ముగించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడం కాస్త సానుకాలాంశంగా కనిపిస్తోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి.బుధవారం ముగింపు (80, 539)తో పోల్చుకుంటే గురువారంవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ రోజులో చాలా సమయం లాభాల్లోనే కదలాడింది. గురువారం సెన్సెక్స్ 80, 489-80,751 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు సెన్సెక్స్ 57 పాయింట్ల స్వల్ప లాభంతో 80, 597 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 11.95 పాయింట్ల లాభంతో 24, 631 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లో ముత్తూట్ ఫైనాన్స్, మనప్పురం ఫిన్‌కార్ప్, కల్యాణ్ జువెల్లర్స్, యూనో మిండా, ఇన్ఫోఎడ్జ్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఎన్ఎమ్‌డీసీ, హిందుస్థాన్ పెట్రో, మ్యాక్స్ హెల్త్‌కేర్, వోడాఫోన్ ఐడియా, ఎన్‌హెచ్‌పీసీ షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 177 పాయింట్లు కోల్పోయింది. బ్యాంక్ నిఫ్టీ 160 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.55గా ఉంది.

# బంగారం, వెండి ధరల్లో బిగ్ చేంజ్!



గత కొన్ని రోజులుగా తగ్గుతూ ఊరటనిచ్చిన బంగారం ధరలు నేడు కూడా ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. కిలో వెండి ధర రూ. 1000 పెరిగింది. హైదరాబాద్ లో ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.10,135, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.9,290 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.92,900 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,350 వద్ద ట్రేడ్ అవుతోంది.విజయవాడ, విశాఖ పట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 93,050 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,01,500 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో ఈ రోజు కిలో వెండి ధర రూ. 1,26,000 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ. 1,16,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

# ఇకపై 4 గంటల్లో చెక్కుల క్లియరెన్స్




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు భారీ గుడ్ న్యూస్ తెలిపింది. చెక్కుల క్లియరెన్స్ సమయాన్ని రెండు రోజుల నుంచి కేవలం 4 గంటలకు తగ్గిస్తూ కొత్త విధానాన్ని ప్రవేశపెడుతోంది. చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (CTS)ను బ్యాచ్ ప్రాసెసింగ్ నుంచి ఆల్వేస్ క్లియరింగ్, 'ఆన్-రియలైజేషన్-సెటిల్ మెంట్' విధానానికి మార్చనుంది. ఈ కొత్త విధానం రెండు దశల్లో అమలు కానున్నట్టు పేర్కొంది.మొదటి దశ(అక్టోబర్ 4, 2025 - జనవరి 2, 2026)లో ఉదయం 10:00 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఒకే ప్రెజెంటేషన్ సెషన్ ఉంటుంది.బ్యాంక్ బ్రాంచ్ లకు వచ్చిన చెక్కులను వెంటనే స్కాన్ చేసి క్లియరింగ్ హౌస్ కు పంపాలి. డ్రా కావాల్సిన చెక్కులను బ్యాంకులు సాయంత్రం 7:00 గంటలలోపు ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. లేకపోతే అవి ఆమోదించబడినట్లు భావించి సెటిల్ మెంట్ కు చేర్చబడతాయి.రెండవ దశ(జనవరి 3, 2026)లో చెక్కుల గడువు సమయం T+3 గంటలకు మారుతుంది. అనగా ఉదయం 10:00 నుంచి 11:00 గంటల మధ్య వచ్చిన చెక్కులను మధ్యాహ్నం 2:00 గంటలలోపు ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. సెటిల్ మెంట్ పూర్తయిన తర్వాత, క్లియరింగ్ హౌస్ ఆమోదం/తిరస్కరణ సమాచారాన్ని ప్రెజెంటింగ్ బ్యాంక్ కు పంపుతుంది. ప్రెజెంటింగ్ బ్యాంక్ ఈ సమాచారాన్ని ప్రాసెస్ చేసి, ఒక గంటలోపు కస్టమర్ కు విడుదల చేయాలి.చెక్కుల క్లియరెన్స్ సామర్థ్యాన్ని మరింత పెంచడం, సెటిల్ మెంట్ రిస్క్ ను తగ్గించడమే లక్ష్యంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మార్పుల గురించి బ్యాంకులు తమ కస్టమర్లకు అవగాహన కల్పించాలని RBI ఆదేశించింది.



# వార్ 2 ఓవర్సీస్ రివ్యూ..

ఎన్టీఆర్ ఇంట్రడక్షన్ సీన్ కు ఫ్యాన్స్ కు పూనకాలు గ్యారెంటీ. అయితే కథనం రెగ్యులర్ స్పై టెంప్లేట్ లోనే స్థాయిలో సాగుతుంది. ఫస్ట్ హాఫ్ లో వచ్చే సలామ్ అనాలి సాంగ్ లో ఎన్టీఆర్, హృతిక్ ఇద్దరు పోటపోటిగా డాన్స్ లతో ఇరగతిసారు. ఇక ఇంటర్వెల్ లో వచ్చే ట్విస్ట్ సూపర్బ్ గా ఉంటుంది. డీసెంట్ గా సస్టార్ట్ అయిన సెకండాఫ్ కాస్త డల్ గా సాగుతుంది. మధ్యలో వచ్చే యాక్షన్ సన్నివేశాలు మెప్పిస్థాయి. ఇక క్లైమాక్స్ గూస్ బమ్స్ తెప్పిస్తాయి. ఓవరాల్ గా చూస్తే వార్ 2 YRF నుండి వచ్చిన టైగర్ 3 కంటే మెచ్చుకోతగిన స్థాయిలో ఉంటుంది. కియారాకు ఈ సినిమాలో ఒక సాంగ్, ఒక ఫైట్ తప్ప చెప్పుకోవ డానికి ఏమి లేదు. ఈ సినిమాకు ప్రధానమైన మైనస్ అంటే VFX. ముఖ్యంగా బోట్ చేజింగ్ సీక్వెన్స్ లో VFX చాలా నాసిరకంగా ఉంటాయి. అయితే ఎన్టీఆర్ ను మాత్రం అయాన్ ముఖర్జీ చాలా బాగా చూపించాడని చెప్పాలి. ఎన్టీఆర్ నుండి ఆశించే మాస్ సినిమా స్థాయిలో కాకుండా బాలీవుడ్ స్థాయి స్పై సినిమా చూడొచ్చు. ఓవరాల్ గా వార్ 2 ఇండిపెండెన్స్ కు డీసెంట్ వాచ్.




# మీడియం రేంజ్ సినిమాల సంగ్రామం..

మాస్ యాక్షన్ కి కొత్త డెఫినిషన్ చెప్పబోతున్న 'ఘాటి' సెప్టెంబర్ 5న థియేటర్స్ లో కి రానుంది! ఓ సాధారణ యువతి తన ఊరిని కాపాడుకునే పోరాటం చుట్టూ తిరిగే ఈ కథ, విలేజ్ నేటివిటీతో, ఎమోషనల్ పంచ్ లతో, యాక్షన్ బ్లాక్స్ తో నిండిపోయింది. తేజ సజ్జా, మంచు మనోజ్ కాంబినేషన్ లో 'మిరాయ్' హై-ఆక్టేన్ యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్ టైనర్. మాస్ బిల్డప్, సస్పెన్స్ ట్విస్ట్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ అన్నీ కలిసిన ఈ సినిమా, టీజర్ తోనే ఫ్యాన్స్ కి అదిరిపోయే కిక్ ఇచ్చింది. సెప్టెంబర్ 5న థియేటర్స్ లో ఈ పవర్ ప్యాక్డ్ క్లాష్ బాక్స్ ఆఫీస్ ను షేక్ చేయడానికి రెడీ అవుతోంది.రష్మిక ప్రధాన పాత్రలో వస్తున్న 'ది గర్ల్ ఫ్రెండ్' మోడర్న్ రిలేషన్ షిప్స్ లోని ఎమోషనల్ లేయర్స్, అన్ ఎక్స్ పెక్టెడ్ ట్విస్ట్స్ తో నిండిన రొమాంటిక్ డ్రామా. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, సాంగ్స్ లో రష్మిక చార్మ్, స్క్రీన్ ప్రెజెన్స్, మెలోడీయస్ సాంగ్స్. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియన్స్ కి కనెక్ట్ అవుతున్నాయి. సెప్టెంబర్ 5న ఈ ఎమోషనల్ జర్నీ థియేటర్స్ లో ప్రారంభమవుతుందని అంటున్నారు. వీటితో పాటు కిష్కిందా పురి మాస్ యాక్షన్, హారర్ ఎమోషనల్ డ్రామా రిలీజ్ కానుందని సమాచారం. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న ఈ సినిమా గ్లింప్స్ వచ్చిన దగ్గర నుంచే ఆడియన్స్ కు ఆసక్తి ఏర్పడింది. రీసెంట్గా రిలీజ్ అయిన లిరికల్ సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఎంతగానో ఎట్రాక్ట్ చేస్తుంది. మరి ఈ రేస్ లో గెలిచేది ఎవరో కాసులు రాబట్టే సినిమా ఏదో మరికొద్ది రోజులు ఆగితే తెలుస్తుంది.




# కూలీ ఓవర్సీస్ రివ్యూ..


రికార్డ్ స్థాయి అడ్వాన్స్ బుకింగ్స్ తో ఎక్కడ చుసిన కూలీ ఫీవర్ తో మారుమోగిన కూలీ ఓవర్సీస్ ప్రీమియర్స్ ముగిసాయి.బిగ్గెస్ట్ మల్టీస్టారర్ గా వచ్చిన ఈ సినిమా ఎలా ఉందంటే.. సూపర్ స్టార్ 50 ఇయర్స్ స్పెషల్ టైటిల్ కార్డుతో స్టార్ట్ అయిన కూలీ సినిమా స్టార్ట్ అయినా మొదటి గంట వరకు చాలా ఫ్లాట్ గా సాగుతుంది. ఒకే ఒక ఫైట్ హై ఫీల్ ఇస్తుంది తప్ప రిమైనింగ్ అంత వీక్ నేరేషన్ లో సాగుతుంది. ఊహించని మలుపుతో మరియు మంచి ప్రీ-ఇంటర్వెల్ సీక్వెన్స్ తో ముగిసింది. ఫస్ట్ హాఫ్ ను నాగార్జున మరియు సౌబిన్ షాహిర్ చాలా వరకు సేవ్ చేసారు. నాగార్జున స్టైల్ మరియు నటన, ఐ యమ్ ది డేంజర్ సాంగ్ ఫ్యాన్స్ కు ట్రీట్ లా ఉంటాయి. ఇక సెకండాఫ్ స్టార్ట్ అవడమే నీరసంగా స్టార్ట్ అయిన కూలీ వావ్ అనిపించే మూమెంట్ ఎక్కడ కనిపించదు. యాక్షన్ సన్నివేశాలలో కొన్ని పాత సినిమా పాటలను ఉపయోగించడం తప్ప, లోకేష్ ఎక్కడ తన క్రియేటివిటీ చూపించలేదు. సూపర్ హిట్ అయిన మోనికా పాట ప్లేస్ మెంట్ అసలు సెట్ అవలేదు. ఇక క్లైమాక్స్ చివరి 20 నిమిషాలు తప్ప చెప్పుకోవానికి ఏమి లేదు. ఓవరాల్ గా కూలీ అంచనాలను అందుకోలేదని ఓవర్సీస్ నుండి వస్తున్న టాక్.

# మరో వివాదంలో శిల్పా శెట్టి దంపతులు

ముంబైకి చెందిన ఓ బడా వ్యాపారవేత్తను మోసం చేశారనే ఆరోపణలతో ప్రముఖ బాలీవుడ్ నటి శిల్పా శెట్టి దంపతులు మరో వివాదంలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలోనే వారిపై కేసు నమోదు అయింది. పెట్టుబడి ఒప్పందాల వ్యవహారంలో రూ.60 కోట్లు మోసం చేశారని నటి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యాపారవేత్త ఫిర్యాదుతో జుహు పోలీసులు కేసు నమోదు చేశారు. షాపింగ్ ఫ్లాట్ ఫాం బెస్ట్ డీల్ టీవీకి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా డైరెక్టర్లుగా ఉన్న సమయంలో డబ్బులు ఇచ్చానని దీపక్ కొఠారి అనే వ్యాపారవేత్త ఆరోపించారు. 2015-23 మధ్యలో వ్యాపారంలో భాగంగా రూ.60.48 కోట్లు ఇచ్చానని, 2016లో నటి శిల్పా శెట్టి తనకు హామీ కూడా ఇచిందని దీపక్ కొఠారి ఫిర్యాదులో పేర్కొన్నారు. 87 శాతం వాటా కలిగి ఉన్న వారు కొన్ని నెలల తర్వాత శిల్పా శెట్టి తన డైరెక్టర్ పదవికి రాజీనామా చేయగా.. దీంతో షాపింగ్ ఫ్లాట్ ఫాం బెస్ట్ టీవీ కంపెనీ దివాలా తీసిందని తెలిపారు. మరోవైపు రాజీనామా విషయాన్ని బయట చెప్పలేదని, తన దగ్గర తీసుకున్న డబ్బులను వ్యక్తిగతంగా వాడుకున్నారని నటి శిల్పా శెట్టి దంపతులపై దీపక్ కొఠారి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. రూ. 10 కోట్లు దాటినందున ఈ కేసు దర్యాప్తును ఆర్థిక నేరాల విభాగం కి అప్పగించినట్లు తెలిసింది. కాగా, గతంలో శిల్పా శెట్టి దంపతులపై మనీలాం దరింగ్ చేశారనే ఆరోపణలతో ముంబైలో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.



# సక్సెస్ జర్నీకి 'కూలీ' బ్రేక్



పరాజయం అనే పదాన్నీ దరిదాపుల్లోకి కూడా రానివ్వకుండా జైత్రయాత్ర సాగిస్తున్నాడు. అతడెవరో కాదు ప్రస్తుతం తమిళ్ ఇండస్ట్రీని షేక్ చేస్తున్న లోకేష్ కనగరాజ్.మా నగరంతో డైరెక్టర్ గా ఎంట్రీ ఇచ్చిన లోకేష్ కనకరాజ్ ఖైది సినిమాతో టాక్ ఆఫ్ ది టౌన్ గా నిలిచాడు. ఒక రాత్రిలో జరిగే కథతో తెరకెక్కిన ఈ సినిమాతో లోకేష్ స్టార్ డైరెక్టర్ గా మారాడు. ఇక ఆ తర్వాత విజయ్ తో మాస్టర్, లియో సినిమాలతో అగ్ర దర్శకుల లిస్ట్ లో ఫస్ట్ ప్లేస్ కు చేరుకున్నాడు లోకేష్. ప్రస్తుతం సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ సినిమాను తెరకెక్కించాడు లోకి. ఈ మల్టీ స్టారర్ మూవీ కి అయిన బడ్జెట్ సుమారు ₹300 కోట్లు. భారీ హైప్ క్రియేట్ అయిన ఈ సినిమా నేడు థియేటర్స్ లో రిలీజ్ అయింది. లోకేష్ కెరీర్ లో రిస్క్ మోస్ట్ ప్రాజెక్ట్ గా వచ్చిన ఈ సినిమా ఓవర్సీస్ ప్రీమియర్స్ అలాగ తమిళనాట ఉదయం ఆట నుండి మిశ్రమ స్పందన రాబట్టింది. కథ, కథనం వీక్ గా ఉందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటి వరకు ఫ్లాప్లే లేని ఈ డైరెక్టర్ కు కూలీ బ్రేక్ వేసిందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు ప్రీ బజ్ కారణంగా బుకింగ్స్ లో మాత్రం ఎక్కడ తగ్గకుండా దూసుకెళ్తోంది కూలి. వచ్చే సోమవారం వర్కింగ్ డే స్టార్ట్ అయితే కానీ కూలీ రిజల్ట్ క్లారిటీ రాదు. కానీ కూలీ లోకి వీకేస్ట్ రైటింగ్ అని చెప్పక తప్పదు.

# లక్ కలిసి రావట్లేదా..?

కల్కి2898ఏడీతో గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చినా ఫరియాకు పెద్దగా యూజ్ కాలేదు. మత్తు వదలరా2తో బ్లాక్ బస్టర్ అందుకుంది.మత్తువదలరా2తో గట్టి కంబ్యాక్ కొట్టిన తర్వాత కూడా ఫరియాకు లక్ కలిసి రావట్లేదు. బిగ్ హీరోల ఆఫర్స్ కోసం చూస్తే ఫేట్ మరోటి డిసైడ్ చేస్తోంది చిట్టి విషయంలో. ఎస్టాబ్లీష్ కానీ హీరోలతో నటించే ఛాన్స్ దక్కించుకుంది. పోనీ కోలీవుడ్ చెక్కేద్దామంటే అక్కడ గడ్డుకాలం ఎదురౌతుంది. తమిళంలో విజయ్ ఆంటోనీ సరసన వల్లిమయిల్ చేసింది బ్యూటీ. షూటింగ్ కు ఎప్పుడో గుమ్మడికాయ కొట్టారు కానీ విడుదలకు నోచుకోవడం లేదు. కోలీవుడ్ ఎంట్రీ కూడా మరింత ఆలస్యం అయ్యేట్లే కనిపిస్తోంది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో మేడమ్ కే క్లారిటీ లేదు. తెలుగులో ఎప్పుడో కమిటైన భగవంతుడు ఎంత వరకు వచ్చిందో నయా అప్డేట్ లేదు. ఇక ఓటీటీ హీరోగా బ్రాండ్ వేయించుకున్న నరేష్ అగస్త్యతో గుర్రం పాపిరెడ్డిలో జోడీ కడుతోంది. అడల్ట్ కామెడీగా వస్తోన్న రిలీజ్ డేట్ లాక్ కాలేదు. ఈ గ్యాప్ లో ఫ్యాన్స్ తో టచ్ పోకుండా ఫోటో షూట్లతో సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది ఫరియా.




# టాలీవుడ్ కు దూరంగా..



కన్నప్పతో హ్యాట్రిక్ హిట్ కొట్టి గోల్డెన్ లెగ్ ట్యాగ్ తీసుకుందామనుకున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్ ఫ్లాప్ చవిచూసింది. సినిమాలో ప్రీతి నటించింది అన్నమాటే కానీ మేడమ్ ప్రమోషన్లలో పాల్గొనలేదు. కానీ సినిమాలో గ్లామర్ షో, ఇంటిమసీ సీన్లలో తన స్టఫ్ ఇచ్చేసింది. యూత్ నయా గర్ల్ ఫ్రెండ్ గా మారిపోయింది. టాలీవుడ్, కోలీవుడ్ తెరంగేట్రం సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ కావడంతో పాటు రిజల్ట్ పాజిటివ్ గా రావడంతో నెక్స్ మల్లూవుడ్ లో లక్ టెస్ట్ కు రెడీ అవుతోంది భామ. మైనే ప్యార్ కియా అంటూ మాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది ప్రీతి ముకుందన్. హృదు హరూన్ హీరోగా నటిస్తోన్న ఈ ఫిల్మ్ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. ఆగస్టు 29న ఓనమ్ కి రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఇప్పుడిప్పుడే మలయాళంలో రిజిస్టర్ అవుతోన్న ఎలక్ట్రానిక్ కిలీ మ్యూజిక్ డైరెక్టర్. మైనే ప్యార్ కియానే కాదు ప్రీతి చేతిలో మరో మాలీవుడ్, రెండు తమిళ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. కానీ కన్నప్ప తర్వాత టాలీవుడ్ ఆఫర్స్ వచ్చిన దాఖలాలు లేవు. మరి కన్నప్ప వల్ల మేడమ్ హర్ట్ అయ్యిందో లేక ఆఫర్లు రావట్లేదో కొత్త సినిమా కబురు చెప్పలేదు. మళ్లీ ప్రీతి టాలీవుడ్ తలుపు తడితే చూడాలనుకుంటున్నారు ఇక్కడి ఆడియన్స్.

# ఈ డబుల్ ట్రీట్ మీకోసమే..

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'మదరాసి' ఒకటి. ఎఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుంది. శ్రీ లక్ష్మీ మూవీస్ రూపొందిస్తుంది. ఈ విజువల్ వండర్ లో బిజు మీనన్, షబీర్, విక్రాంత్, విద్యుత్ జామ్వాల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అనురుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా తమిళం, తెలుగు అండ్ హిందీ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధం అవుతోంది.ఇక ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసున్న ఈ మూవీ ప్రమోషన్స్ లో జోరు పెంచగా.. తాజాగా గ్లింప్స్ అప్డేట్ ఇచ్చింది. 'తలైవర్ దర్శనం కోసం థియేటర్లకు వెళ్తున్నారా? అయితే ఇది మీకు డబుల్ ట్రీట్.. కూలీ ఫైర్ తో పాటు పెద్ద స్క్రీన్ లలో ప్రత్యేకంగా ప్రదర్శించబడుతున్న మధరాసి ఎక్స్ టెండెడ్ గ్లింప్స్ ను కూడా చూసి ఎంజాయ్ చేయండి' అంటూ రజినీకాంత్ సినిమా కూలీతో పాటు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.




# చూడు బార్బరికా.. ఈ యుద్ధం నీది

స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ పై విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. సత్యరాజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో వశిష్ఠ ఎన్ సింహా, సత్యం రాజేశ్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఆగస్టు 22న విడుదల కానున్న ఈ మూవీ ట్రైలర్ ను మేకర్స్ బుధవారం రిలీజ్ చేశారు.మిస్సింగ్ కేసు, మర్డర్ కేసు తిరిగే కథ అని అర్థమవుతోంది. ఓ పురాణ కథకు, వర్తమాన సామాజిక సమస్యల్ని ముడిపెడుతూ కథను దర్శకుడు మోహన్ శ్రీవత్స తెరకెక్కించినట్టనిపిస్తోంది. లవ్ స్టోరీ, తాత మనవరాలి ట్రాక్ ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్టు తెలుస్తోంది. ట్రైలర్ లో 'చూడు బార్బరికా.. ఈ యుద్ధం నీది.. ధర్మ ధ్వజం రెపరెపలాడా లంటే అధర్మం చేసేవారికి దండన లభించాలి'.. 'పాలల్లో నీళ్లే కలుపుత.. విషం కలుప' వంటి డైలాగులు ఆకట్టుకున్నాయి.




Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**